
# పురుష ప్రయత్నం - గురు అనుగ్రహం



సద్గురు శ్రీ పెసల సుబ్బరామయ్య



అంకితము: శ్రీ భరద్వాజ మాస్టర్ గారి పాదపద్మములకు

**సేకరణ మరియు పర్యవేక్షణ:** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

**ప్రాప్తిస్థానము:** శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

**ఈ గ్రంథ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు.**

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | 4 |
| సద్గురుని దరి చేర్చేది పుణ్యమే | 5 |
| శ్రీ సార్ ప్రయత్నము - గురు అనుగ్రహము | 6 |
| గురు వాక్యపాలనే సాధన | 12 |
| తమ జీవితాన్ని సాధనలో  భాగంగా చేసిన శ్రీ  సార్ | 16 |
| ధర్మాచరణ | 20 |
| విశ్వాసం | 22 |
| నిష్కామ కర్మ - గురు సేవ | 23 |
| భక్తుల అనుభవాలు | 24 |

# ముందుమాట

శ్రీ సుబ్బరామయ్య సార్ సామాన్య మానవునిలా జన్మించి, ఉత్తమ సాధకునిగా సద్గురు సేవచేసి, సంపూర్ణ శరణాగతితో జీవిస్తూ, జ్ఞాన పూర్ణులై నిలిచారు. శ్రీ సార్ జీవిత సంఘటనలు అతి సామాన్యులమైన మనందరికీ నిరంతరం ఎదురయ్యే సన్నివేశాలను – సంఘటలను సద్గురు పరం చేస్తూ, సద్గురు సేవ ఎలా చేయాలో తెలిపే మార్గదీపికలుగా నిలుస్తాయి. శాస్త్ర పాండిత్యానికి ప్రాధాన్యమివ్వక, శ్రీ మాష్టారు ప్రసాదించిన అమృత గుళికలైన సద్గ్రంధ పటనము - శ్రీ మాష్టారి మంచి మాటకు "హత్ దరూన్ చలాల్" ద్వారా శ్రీ సార్ పొందిన శాస్త్ర ప్రతిపాదికమైన దివ్యస్థితి మనకు సద్గురు శరణాగతి ఉన్నత్యాన్ని తెలుపుతూ ఆచరణాత్మక స్ఫూర్తి నిస్తుంది.

సద్గురు శ్రీ సుబ్బరామయ్య గారి సాధనను, జీవిత విధానమును తరచి చూస్తే ఉద్ధరేదాత్మనాత్మనం (ఎవరికి వాళ్ళను ఉద్ధరించుకోవాలి), మోక్షయిష్యామి మాశుచః (మోక్షమును నేను ఇస్తాను) అని భగవంతుడు శ్రీ కృష్ణుడు (భగవద్గీతగా) చెప్పిన మాటలకు సమన్వయము కనిపిస్తుంది. ఈ జన్మలోనే ముక్తిని సాధించవచ్చు అని తమ జీవితములో చేసి చూపించటమే గాక మనం కూడా పొందేందుకు మనమేమి చేయాలో చూపే చుక్కానులు. ఈ చిన్న గ్రంధములో సార్ యొక్క జీవన సంఘటనలు - ఆచరణ ఆధారంగా సార్ సూచించిన సాధనానుక్రమమును హ్రదయగతం చేసుకొనే చిన్న ప్రయత్నం ఈ పుస్తకం. ఈ గ్రంధం మనందరినీ ముక్తికి ప్రేరేపిస్తూ సాధన పథంలో నడపాలనీ, ఆ పథంలో అంతటా ఉన్న సద్గురువుని (భగవంతుని) సేవిస్తూ 'నాది','నాకు' అనే భ్రాంతి నుండి అంతటా ఉన్న "నేను" లో లీనమొనర్చు గాక!

**ఈ గ్రంధ కూర్పుకు, ముద్రణకు ముఖ్య కారణాలు :**

- సార్ జీవిత విశేషాలను తలుచుకుంటూ సార్ సాంగత్యం నిరంతరం పొందాలని
- సార్ తో అనుబంధమున్న వాళ్ళందరి కీ మార్గదర్శకంగా సహకరించాలని
- గురు సేవగా గురుని చరిత్రని నలుగురితో పంచుకుని నిరంతరం గురు స్మరణ చేయాలని.

ఈ గ్రంధములోని ప్రతి విషయాన్ని పరిశీలించి, ఆచరణకు ప్రయత్నిస్తూ, పారాయణ చేసి అందరూ గురు (సార్) కృపను పొందగలరు.

# సద్గురుని దరి చేర్చేది పుణ్యమే

శ్రీ సుబ్బరామయ్య సార్ భరద్వాజ మాస్టర్ ని దర్శించక ముందు జీవనానికి దర్శించిన తరువాత జీవిత విధానానికి గల వ్యత్యాసం పరిశిలిస్తే గురు సన్నిధి ఔన్నత్యము ప్రస్ఫుటము అవుతుంది. పరుసవేది స్పర్శతో ఇనుము బంగారము అయినట్లు ధర్మాచరణ, మానవత్వము, పట్టుదల, దైవము-ధర్మముపై విశేషమైన విశ్వాసము మొదలగు ఉత్తమ సంస్కార యుతులైన శ్రీ సార్ శ్రీ భరద్వాజ మాస్టారి ప్రధమ దర్శనము - సాంగత్యము తోనే పూర్ణ విరాగి, గురు భక్తి, సేవలలో నెలకొన్నారు. వారి మాటలలో "పశు జీవనం నుండి - ఆనంద మయ జీవనం లోకి అడుగిడినాను"

వీటి వివరణ మనం శ్రీ భరద్వాజ మాస్టర్ ను దర్శించక ముందు తమ జీవనము గూర్చి శ్రీ సార్ రచించిన "గురుస్తుతి" లోని "సద్గురుని దరి చేర్చేది పుణ్యమే" అని వివరించే చివరి వ్యాసంలో చూడవచ్చు.

**మానవత్వం :**

శ్రీ సార్ బాల్యం నుండి తన చుట్టూ ఉన్న, ప్రక్క వారి ఎవరి భాధనూ సహించ లేరు (ఆడుకునే వయసులో ఒళ్లంతా పుండ్లు పడిన అనాధ వృద్ధురాలిని నెల్లూరు ఆస్పత్రిలో చేర్చటం, అసహాయరాలైన స్త్రీని అధర్మంగా కొడుతున్న భర్త నుండి రక్షించటం మొ ||). వారి భాధ నివారించటానికి తన వయస్సుకు మించి శక్తి, సమయస్ఫూర్తితో స్పందించి సాయం చేయటం వారి మానవత్వ వికాసము, విశేష ప్రయత్నానికి ప్రతిబింబించగా సార్ తలపెట్టిన కార్యము వారికీ విశేష సహాయంగా రూపుదిద్దటం - భగవత్ కృపను వ్యక్త పరుస్తుంది.

**పట్టుదల :**

అట్లే శ్రీ సార్ పట్టుదల నెల్లూరు చదువుకు పంపుటకు - మూడు పుటలు పచ్చి మంచి నీరు కూడా ముట్టక చేసిన ప్రయత్నము లో - దైవ కృప నెల్లూరుకు చదువుకు వెళ్లి భవిష్యత్తులో BSc., BEd. టీచర్ గా ఎందరికో చక్కటి విధ్యాబుద్ధులు నేర్పే అవకాశంగా మారింది.

**ధర్మము - దైవం పై విశ్వాసము:**

శ్రీ సార్ కు ధర్మము, దైవంపై విశ్వాసము లో గల తీవ్రత శ్రీ సార్ ఇంటి-స్థలం విషయంలో వివాదం వచ్చినప్పుడు "మన ఇద్దరి చేతులు అఖండ దీపం నూనెలో పెడదాము. ఎవరిది అధర్మం అయితే వారి చేయి కాలుతుంది", అని ప్రతిజ్ఞ చేయించాలి అనేవారు.

**శ్రీ భరద్వాజ మాష్టారు, వెంకయ్యస్వామి సాంగత్యం లభించాక శ్రీ సార్ లోని మానవత్వం - విశ్వ గురుసేవా భావం గా, పట్టుదల - గురు నిర్దేశ నియమ పాలనలో**

**విశేషప్రయత్న శీలుని గా, ధర్మము, దైవంపై విశ్వాసము - గురువు పై పూర్ణ విశ్వాసము - శరణాగతిగా పరిణమించాయి.**

# శ్రీ సార్ ప్రయత్నము - గురు అనుగ్రహము

శ్రీ భరద్వాజ మాష్టారి మొదటి దర్శనములోనే శ్రీ మాష్టారి సన్నిధి సాంగాత్యలకి విశేష తపన శ్రీ సార్ లో జనించింది. శ్రీ మాష్టారి పరిచయం ముందు "ఆయన గొప్పతనం ఏమిటి? ఆయన షేక్స్పియర్ గూర్చి ఏమి చెబుతాడు?" అని ప్రశ్నించిన శ్రీ సార్ మాస్టారి తొలి పరిచయం అనంతరం మాష్టారితో శ్రీ వెంకయ్య స్వామి దర్శనంనకు వెళ్ళటం, మూడో రోజే వాకాడు లో శ్రీ మాష్టారి సన్నిధిలో శ్రీ సమర్ధ నారాయణ మహారాజ్ గారి దర్శనం, ఆ రోజే మాష్టారి ఇంట్లో విద్యానగర్ లో శ్రీ రంగన్న బాబు గారి దర్శనం, శ్రీ రంగన్న బాబు గారి లీలలు వింటుంటే ధారగా కన్నీళ్ళు (ఆనంద భాష్పాలు), ఒక దివ్య స్థితి లో పళ్ళెంలో బియ్యం పై శ్రీ సాయి అని వ్రాసి మాష్టారి ముందు పెట్టటం - అలా తెలియని అలౌకిక స్థితిని అనుభవించిన శ్రీ సార్ శ్రీ మాష్టారి సాంగత్యములో లభ్యమేయ్యే అద్భుత ఆనందము చవిచూచుటకు ప్రతి వారం శ్రీ మాష్టారి సన్నిధికి వెళ్ళే వారు. ఉత్తమ సంస్కారములు - పుణ్యము మనను సద్గురు సన్నిధికి ఎలా ఆకట్టుకొంటాయి, ఎలా సద్గురు సన్నిధి అనే అయస్కాంతం క్షేత్రం అట్టి ముడి ఇనుముగా గల ఉత్తమ సంస్కార వంతులను ఎంత సులభంగా ఆకర్షించి ఎంత వేగంగా ఆయస్కాంతీకరణ చేస్తుంది అనేది ఇక్కడ చూడవచ్చు.

శ్రీ మాష్టారి కి శ్రీ సార్ తనలోని బలహీనతల గూర్చి చెప్పుకున్నప్పుడు "నిప్పు వద్ద ఉన్న బట్టల తడి సహజంగా ఆరినట్లు మహాత్ముల సాంగత్యము లో మనం అడుగకనే మనలో మార్పు వస్తుంది - బలహీనతలు రాలిపోతాయి" అని చెబుతారు. ఈ సూచన ఆచరణ నేపధ్యంలో శ్రీ సార్ విశేష ప్రధానము గా తన ఉద్యోగ విధి విర్వహించే సమయం మినహా తన మొత్తం కాలాన్ని శ్రీ స్వామి సన్నిధిలో గడపటం చూడవచ్చు. స్వామి కలిచేడు వచ్చినప్పుడు సాయంత్రం 8 - 12 గం వరకు స్వామి సన్నిధిలో గడపటం. అట్లే శ్రీ వెంకయ్యస్వామి వారి వద్ద అనుభవం కలిగాక స్వామి సన్నిధి - సేవ తప్ప వేరే వ్యవహారమే లేక గడపటం శ్రీ సార్ కు ఆధ్యాత్మికత - గురు అనుగ్రహం పై గల శ్రద్ధను నిరుపిస్తాయి. అది మెచ్చిన స్వామి సార్ ను ఆరోగ్య మిష మిద గోలగమూడి నివాసము - తన శాశ్వత సన్నిధి ప్రసాదించారు. ఎందరో భక్తుల అనుభవాలు శ్రీ సార్ కు వినిపిస్తూ - గ్రంధస్థం చేసే అద్భుత సేవను అనుగ్రహించి పునీతులను చేసి శ్రీ సార్ ను ఎందరికో మార్గ దర్శకంగా - ఆశ్రయము గా నిలిపారు.

గురుసన్నిధి లాభము శ్రీ సార్ అనుభవించటమే కాక ఎందరికో అనుభవింపచేసారు. ఉదాహరణకు శ్రీ సార్ వద్ద చదువుకున్న శ్రీ వేణుగోపాల్ గారు

గుజరాత్ లో పనిచేస్తూ వాళ్ళ ఇంటికి వచ్చినప్పుడల్లా శ్రీ సార్ వేణుగోపాల్ గారిని తీసుకోని మాష్టారి సమాధి దర్శనం చేయించటం, అమ్మగారి దర్శనం చేయించటం, అప్పుడు జరిగే శ్రీ మాస్టారి గృహ నిర్మాణ కార్యక్రమములో పాలు పంచుకొనేలా సదవకాశం కలిపించటం చేసేవారు.

అట్లే శ్రీ అవధూతలీల, అవధూత బోధామృతం మొదలుకొని స్వామి లీలలు చిన్న పుస్తకాలుగా ప్రచురించి విరివిగా పంచటం, "నిత్య సత్యులు శ్రీ భరద్వాజ మాష్టారు" మొ|| పుస్తకాల ద్వారా సమాధి అనంతరం ఈ మహాత్ములను సేవించుకొనే వారికి వారి నిజతత్వం మరుగున పడకుండా హెచ్చరించి ఈ మహాత్ముల సన్నిధి - సాంగత్య అద్భుత అనుగ్రహం చవిచూచేందుకు ప్రేరణగా నిలిచి శ్రీ మాష్టారు ఆచరించి చూపిన పంథాలో మార్గదర్శకము చేసారు.

**భగవంతుడు మన నుంచి కోరుకునేది ఏమిటి?**

శ్రీ భరద్వాజ మాస్టర్ భగవంతుడు మన నుంచి కోరుకునేది ఏమిటి? అని ప్రశ్న వేసి, ఆయనే సమాధానం చెప్పేవారు. 1. కాలము 2. మనస్సు 3. కృతజ్ఞతా భావము. ఈ వాక్యాన్ని సుబ్బరామయ్య సార్ తు||చ|| తప్పక ఆచరించారు. కలిచేడులో రోజు ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు పారాయణ, పూజ, ధ్యానం చేసేవారు. ఈ విధంగా 3 సంవత్సరముల పాటు కృషి చేస్తే పూండి స్వామి ఆశీస్సులతో సార్ కి ధ్యానం బాగా కుదిరింది.

శ్రీ సుబ్బరామయ్య సార్ కూడా పై చెప్పిన తమ గురు వాక్యాన్ని (భగవంతుడు మన నుంచి కోరుకునేది 1. కాలము 2. మనస్సు 3. కృతజ్ఞతా భావము) పలుమార్లు చెప్పేవారు. ఈ విషయం యొక్క ప్రాధాన్యత శ్రీ ఎక్కిరాల అనంత కృష్ణ మాస్టారు మాటల్లో చాలా చక్కగా ఆవిష్కరింపబడినది. ఈ విషయం అవగతం అవడం వల్ల ఒక వంక మనల్ని పురుష ప్రయత్నానికి కార్యోన్ముఖము చేస్తే, మరోవంక అలా ఆచరిస్తే ఏ విధంగా సద్గురు అనుగ్రహం అనుభవం అవుతుంది అన్న అవగాహన కలుగగలదు.

పురుషుడు - ఏ మానవుడైన సరే - పంచకోశములతో (పంచభూతములతో) సృష్టింపబడి, 33 ప్రముఖ దేవతా శక్తులచే పనిచేయించబడుతున్నాడో వివరించారు. మన ఇంద్రియములకు అనుభవం అయ్యే ఈ శరీరం అన్నమయ కోశమునకు (భూమికి) ప్రతీక. ఆలోచనలు మనోమయ కోశమునకు (జలము), బుద్ధి విజ్ఞానమయ కోశమునకు (అగ్ని), వీటన్నిటికీ ఆధారమైన ప్రాణశక్తి ప్రాణమయ కోశమునకు (వాయువు), దీనికి మూలమైన ఆకాశము ఆనందమయ కోశము. మన వైపునుంచి చూస్తే పురుషుడి ప్రజ్ఞ అన్నమయ కోశం వైపు మొదలైతే, వాస్తవానికి దానికి ఆధారం సద్గురు అనుగ్రహం - ఆనందమయ కోశము వైపు నుంచి నిరంతరం ప్రసరించే మనలోని వెలుగు. కానీ ఎప్పుడైతే అలైన్మెంట్ (సహజము, నిర్దుష్టమైన అమరిక) మిస్ అవుతుందో సద్గురు

అనుగ్రహం పొందలేకపోతున్నాము (పై విషయము అనుభవము కాదు). దీనికి ఒక ఉదాహరణ: సరిగ్గా ఒకదాని వెనుక ఇంకొకటి అమర్చబడ్డ అట్టముక్కల మధ్యలో ఉన్న చిల్లు గుండా ప్రసరించే దీపం వెలుగు ఆవలి వైపు నుంచి చూడగలిగినట్లు! ఎప్పుడైతే ఏ ఒక్క అట్టముక్క అయినా మిస్ అలైన్ అయితే, ఆ వెలుగు కనబడక పోవడమే కాక ఆ మిస్సు అలైన్ అయినటువంటి అట్టముక్కే కనిపించినట్లు, మనకు గురువు అనుగ్రహం అనుభవమునకు రాక, అటు శరీరమో, మనసులో వచ్చే ఆలోచనలో, బుద్ధి ద్వారా చేసే యోచనో, ఆనందం (ప్రేమ, కరుణ, కృతజ్ఞత) అప్పటి అలైన్ మెంట్ బట్టి కనిపిస్తూ ఉంటాయి. ఈ అమరిక లో అవకతవకలు గుర్తించి - వెలుగు కనపడే వరకు సరిచేసుకొనే పరిశ్రమను పురుష ప్రయత్నం గాను - దానికి మార్గ దర్శనం చేస్తూ చివరగా దర్శనమిచ్చే వెలుగును గురు అనుగ్రహంగాను గుర్తించి అన్వఇంచుకోగలము.

త్రికరణశుద్ధి ద్వారా శరీరం, మనసు, బుద్ధి, మొదలుగా గల కోశములలోని అమరిక సరిచేసుకోనుటకు - గురువు అనుగ్రహం అనుభవము అగుటకు చేయవలసిన విశేషయత్నం (పురుషప్రయత్నం) గూర్చి ఇంకో రెండు విషయాలు శ్రీ అనంతకృష్ణ మాస్టారు చెప్పినవి స్మరించుకొని అన్వయించుకోవడం సందర్భోచితం:

**కాలం సమర్పణ భావంతో ఇవ్వడం**

నిత్యం ఒకే సమయానికి, ఒకే ప్రదేశంలో ప్రార్థన చేయడం చాలా ముఖ్యము. ఉదాహరణకు రోజు ఇంటి ఆవరణలో ఒకే సమయానికి గింజలు చెల్లితే కొద్ది రోజులకు పావురాలు రావడం, సరిగ్గా అదే సమయానికి అక్కడికి వచ్చి ఎదురు చూస్తూ ఉంటాయి. "బుద్ధిలేని జీవులు" అవే వస్తే ప్రతిరోజు ఒకే ప్రదేశంలో ఒకే సమయానికి ప్రార్థన చేస్తే దేవతలు ఎందుకు రారు?

కొన్ని రోజులు గింజలు వరుసగా వేసి అలవాటయిన తర్వాత మళ్ళా మానివేస్తే కొద్ది రోజులు ఎదురు చూచి పావురాలు తరువాత రావడం మానేస్తాయి. కాబట్టి దేవతలను ఎదురుచూసేటట్లు చేయకుండా (ఒకరోజు ఒక సమయము, ఇంకొక రోజు ఇంకొక సమయానికి కాకుండా) ప్రతిరోజు ఒకే సమయానికి ప్రార్థన మరియు మన పనులను అర్పణ బుద్ధితో చేయాలి అని చెప్పారు. అందుకే కాబోలు మన పెద్దలు పూజ చేసే ముందు సంకల్పంలో "సమస్త దేవతా, బ్రాహ్మణ, హరి-హర, శ్రీ గురు చరణ కమల సన్నిధౌ" అని చేసే ప్రతి సాధన ముందు (పూజా సంధ్యావందనము మొదలుగా గల అన్నిటి ముందు) స్మరించమన్నారు. ఎప్పుడెప్పుడు స్మరిస్తామో, మనలోనే (అంటే ప్రతి జీవిలోనూ) ఉన్న ఆ వెలుగు - గురువు - వారి సన్నిధిని ప్రసాదిస్తారు. ఎక్కడైతే సద్గురు స్మరణ జరుగుతుందో శ్రీ గురుగీతలో చెప్పినట్లు "సర్వ తీర్థాలు, క్షేత్రాలు, దేవతలు, అక్కడ కొలువు చేస్తాయి". ఆ సన్నిధిని ప్రతిరోజూ క్రమం తప్పక అనుభవించడం వల్ల మనస్సు, బుద్ధి, ప్రాణచలనము మొదలగు కోశములలో అమరిక ఏర్పడి ఆత్మస్థుడయిన సద్గురు దర్శనము

మరియు మార్గదర్శము నిత్యం పొందగలమని - దశాబ్దాల పాటు స్వామి పూజ, పారాయణ, ఆరతులు, సత్సంగము మొదలు సాధనలు క్రమం తప్పక నిత్యనూతనత్వంతో ఆచరించి చూపిన సుబ్బరామయ్య సార్ కార్యశూరత్వం మనకు స్ఫూర్తిని ఉత్సాహాన్ని ఇచ్చుగాక!

**ఎప్పుడూ, అంతటా, అవ్యక్తంగా ఉన్న కరెంటు (గురు అనుగ్రహము) జనరేటర్ వైర్ (పురుషుడు) లోనికి ఎలా వచ్చి వ్యక్తం అవుతోంది?**

మనం వాడుకునే కరెంటు (ఎలక్ట్రిసిటీ) ఎలా పుడుతోంది? అని ప్రశ్నించారు. మనకు ట్రాన్స్ఫార్మర్ నుంచి వస్తోంది అంటే, అక్కడికి సబ్ స్టేషన్ నుండి, ఆ సబ్ స్టేషన్ కి మెయిన్ స్టేషన్స్ నుంచి, అసలు మెయిన్ పవర్ జనరేషన్ స్టేషన్స్లో ఎలా జనరేట్ అవుతోంది? అక్కడి నుంచి ఇంటి దాకా కేవలం వైర్లు (వాహకం) ద్వారా ప్రవహిస్తోంది కానీ, అసలు అక్కడ జనరేటర్ వైర్ ల లోకి పవర్ ఎక్కడి నుంచి వస్తోంది, అని ప్రశ్నించారు?

అది ఆలోచిస్తే అక్కడ ఒక పెద్ద మ్యాగ్నెట్ (magnet) ఉంటుంది. ఆ మ్యాగ్నెటిక్ ఫీల్డ్ లో వైర్ చుట్టబడి (copper coil) ఉంటుంది. ఆ విద్యుత్వాహకం చుట్ట - ఒక పెద్ద టర్బైన్ లో ఇరుసుకు బిగించబడి ఉంటుంది. టర్బైన్ బయట బ్లేడుల పై నీళ్లు పడటం ద్వారా ఆ నీళ్లు యొక్క ఫోర్స్ కి టర్బైన్ తిరగడం ద్వారా ఈ కాయలు మాగ్నెటిక్ ఫీల్డ్ లో తిరిగి దానిలో కరెంటు ఉత్పన్నమవుతుంది. ఈ కాయిల్ ను మాగ్నెటిక్ ఫీల్డ్ లో నిరంతరం తిప్పుతూ ఉండడమనే ప్రక్రియ జరగడానికి విశేష ప్రయత్నం అవసరం. ఎప్పుడైతే అది తిరగడం ఆగిపోతుందో అప్పుడు ఆ కాయల్లో కరెంటు ఉత్పత్తి ఆగిపోతుంది. ఇది వాడుకుంటున్నాము కానీ, వీటి వీటిల్లోనూ లేని కరెంట్, ఆ రాగి చుట్ట లోకి ఎక్కడి నుండి వస్తోంది? అని అనంత కృష్ణ మాస్టారు ప్రశ్న అడిగి మరలా ఆయనే చెప్పింది "ఆశక్తి అంతటా ఉంది. ఎప్పుడూ ఉంది కానీ అది వ్యక్తం అవటం లేదు. అవ్యక్తంగా అంతటా ఎల్లవేళలా ఉన్న ఆ కరెంటు ఎప్పుడైతే ఈ కాయిల్ తిరుగుతుందో - మాగ్నెటిక్ ఫీల్డ్ లో అప్పుడు దానిలో వ్యక్తం అవుతోంది". అది కేవలం ఆ wires ద్వారా మనం మిగిలిన అన్నింటికీ సరఫరా చేసుకుని వాడుకుంటున్నాము. అంతేగాకుండా మన భూమి మీద శక్తి ఎలా వస్తోంది అంటే భూమి ఒక పెద్ద మాగ్నెట్. సూర్యుడు నుండి భూమికి శక్తి వస్తోంది. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతూ తన చుట్టూ తానూ తిరుగుతూ ఉండటం వల్ల విద్యుత్ అయస్కాంత క్షేత్రం ఏర్పడి భూమి మీద భూమి చుట్టూ శక్తి ప్రసరిస్తుంది. మరి సూర్యుడికి శక్తి ఎలా వస్తోంది? ఆదిత్యులు 12 మంది. వారిలో 7 గురు పెద్ద సూర్యులు (వాళ్ళే సప్తర్షులు). మిగిలిన 5 గురు సూర్యులు ఆ సప్తర్షుల శిష్యులు. ఆ ఐదుగురు సూర్యులలో మనం చూసే సూర్యుడు ఒకరు. ఆయన తమ గురువులైన సప్తర్షుల చుట్టూ తిరగటం వలన బోధను పొందుతున్నారు. ఆ సప్తర్షులు పరమాత్ముని (సద్గురువు) నుండి శక్తిని

పొందుతున్నారు. అంటే మనం మన దగ్గర ఉన్న శక్తికి మూల కారణం పరమాత్మే ఇన్ని రూపాలలో శక్తి ప్రసరించే ప్రక్రియ.

**ఈ సారూప్యతను మనకు అన్వయించుకుంటే**

- మాగ్నెట్ - గురువు (దేవుడు)
- కాపర్ వైర్ - పురుషుడు (జీవుడు)
- కోయిల్ - ధర్మబద్ధమైన జీవితం (స్వధర్మాచరణ)
- మాగ్నెటిక్ ఫీల్డ్: గురు సన్నిధి (క్షేత్రం)
- టర్బైన్ త్రిప్పడం: పురుషప్రయత్నం (సాధన)
- కరెంట్: గురుఅనుగ్రహము (కృపా-కటాక్షములు)

పురుష ప్రయత్నం ద్వారా (కాలము, మనస్సు, కృతజ్ఞతా భావము సమర్పించి, శరణాగతితో ధర్మాచరణ, నిష్కామకర్మ) ప్రీతితో గురుసేవ నిరంతరం చేయడం వల్ల గురు అనుగ్రహం వ్యక్తం అవుతుంది అన్న విషయాన్ని చెప్పడానికి చెప్పారా ఈ ఉదాహరణ అన్నట్లుగా ఉంది.

**కాలము ఇస్తే వచ్చిన యజ్ఞ ఫలం అవధూత లీల గ్రంథం**

సుబ్బరామయ్య సార్ కాలము ఇస్తే దేవతలు ఉండి రక్షించారు అని జగదీష్ గారు చెపుతున్నారు.

సార్ కి స్వామి వారు ఇచ్చిన అనుభవములతో స్వామివారి ఆజ్ఞగా సార్ ప్రతినిత్యం కలిచేడులో ఉద్యోగం చేసి రాత్రికి తను గొలగమూడిలో నిద్ర చేయడానికి వచ్చేవారు. ఇట్లా ప్రతిరోజు ప్రయాణ సౌకర్యాలు అంతగా లేని ఆ రోజుల్లో 60 కిలోమీటర్లు గురువాజ్ఞగా పాటించి ఉద్యోగ ధర్మం నిర్వర్తించేవారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు గొలగమూడి నుండి కలిచేడు ప్రయాణం, స్కూల్ లో ఉద్యోగ విధులు నిర్వహించాక సాయంత్రం 5 గంటల కలిచేడు నుండి బయలుదేరి రాత్రి 8 గంటలకు ప్రయాణం చేసి గొలగమూడి చేరేవారు. రాత్రి 12 వరకు స్వామి ఆఫీస్ లో మనీ ఆర్డర్ లు వ్రాసే సేవ చేసేవారు. ఉదయమే 3 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు స్వామి అభిషేకము, పూజ. ఈ సమయంలో సార్ స్వామి వారి యొక్క లీలలను సేకరించేవారు. ఇట్టి పురుష ప్రయత్నంతో కాలము అంతయు స్వామి వారి పరం చేయగా గురు అనుగ్రహంగా శ్రీ సార్ యొక్క మనసు స్వామి సమర్పణగా మారింది. తనకంటూ కాలమే లేని రీతిన అనన్య గురు సేవకే శ్రీ సార్ అంకితం అయ్యారు, "**బుద్ధి పుట్టినప్పుడు మాత్రమే సేవ చెయ్యటం కాక, తన శరీరం గురు సేవ కోసమే ఉన్నదని, దానిపై తనకెట్టి అధికారము లేదనీ తలచి చేసినదే సేవ**" అని శ్రీ భరద్వాజ మాష్టారు శ్రీ సాయి లీలామృతంలో చెప్పినదానిని ప్రతిబింబించేలా కాలము - మనస్సు తనవి కావని గురువుకే

అన్న సమర్పణ చేసారు. అందుకు ఎంతటి దివ్యలీల గురుఅనుగ్రహంగా అనుభవము అయ్యిందో ఇచ్చట చూడవచ్చు.

భరద్వాజ మాస్టర్ వ్రాసిన శ్రీ వెంకయ్య స్వామి చరిత్రలో వెంకయ్య స్వామితో పాటు ఇతర మహనీయులను ప్రస్తావించటం శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమ కమిటీ వాళ్ళు మిగిలిన మహనీయుల విషయాలు తీసేసి స్వామి వారి లీలలను పుస్తక రూపంగా ప్రచురించమని అడగసాగారు, ఒత్తిడి చేయసాగారు. భరద్వాజ మాస్టర్ వ్రాసిన గ్రంధాన్ని గొప్పగా ఎవరూ వ్రాయలేరని తెలిసిన సార్ మనస్సులో ఇది నేను వ్రాయకపోతే ఇంకొకళ్ళు చేత వ్రాయిస్తారు అది ఎవరూ కూడా వ్రాయలేరు, నేను ఎట్లానో వ్రాయలేను" అని సతమతమవుతుంటే ఒక రాత్రి స్వప్నంలో భరద్వాజ మాస్టర్ సుబ్బరామయ్య సార్ గుండెల మీద వ్రాసారు. ఆ స్వప్నం తరువాత మనస్సు ప్రశాంతమయ్యింది. తెల్లవారిన తర్వాత ఒంగోలు మాస్టారి దగ్గరకు వెళ్లి స్వప్న వృత్తాంతం చెపితే ఇంకేం సాయిబాబా ఆలా నా రూపంలో వచ్చి వ్రాసారు, ఇంక నువ్వు వ్రాయటం మొదలు పెట్టు అన్నారు. సార్ "నేను ఎలా వ్రాయగలను, మాస్టర్ గారు" అంటే "ఏమి లేదు సుబ్బరామయ్య! ముందర ఉన్న లీలలు వెనక్కి వెనకనున్న లీలలు ముందరకి పెట్టు, అంతే" అని ఒక మార్గం సూచించారు. అలాగే చేస్తాను మరి మీరు ప్రూఫ్ రీడింగ్ చేయాలి అని భరద్వాజ మాస్టర్ కి విన్నవించి, వారిని ఒప్పించారు.

అప్పటి నుండి 3 నెలల పాటు ప్రతిరోజూ స్కూల్ లో ఉద్యోగం అయిన తర్వాత సాయంత్రం 5 గంటలకు బయలుదేరి రాతి 9 గంటలకు ఒంగోలులోని భరద్వాజ మాస్టర్ దగ్గరకు వెళ్లేవారు. భరద్వాజ మాస్టర్ కూడా సుబ్బరామయ్య సార్ ని చూసి ప్రూఫ్ రీడింగ్ పని మీద రాత్రి 10-11 గంటల దాకా చేసేవారు. అప్పుడు సార్ ఒంగోలులో బయలు దేరి తిరిగి ట్రైన్ లో సుమారు రెండు గంటల ప్రయాణం చేసి నెల్లూరుకు అర్ధరాత్రి ఒంటి గంట రెండు గంటలకు వచ్చేవారు. నెల్లూరు రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ మీద అడవి మార్గంలో 14 కిలోమీటర్లు తొక్కుతూ తెల్లవారి రెండు లేక మూడు గంటలకు గొలగమూడికి చేరేవారు. అప్పుడు ఒకటి రెండు గంటలు నిద్రపోయి మరలా స్వామి అభిషేకం-పూజలో ఉదయం 6 గంటలకు ఉండేవారు. అప్పుడు మరలా గొలగమూడి నుండి సైకిలు మీద నెల్లూరు వచ్చి, నెల్లూరు నుండి కలిచేడు స్కూల్ కు బస్సులో 9 గంటలకు చేరేవారు. మరలా ఉదయం 9 గంటల నుండి 5 గంటల వరకు  స్కూల్ అటెండ్ అయ్యి మరల సాయంత్రం ఒంగోలు ప్రయాణం అయ్యేవారు.

ఇట్లా మూడు  మాసాలు తిరిగారు. ఎవరైతే ఇట్టి విశేష పురుష ప్రయత్నంతో తన మనస్సును కాలమును గురువుకు అర్పిస్తారో అట్టివారికి సకల దేవతలు వశమై సర్వ సహకారాలు అందిస్తారని అనడానికి నిదర్శనంగా ముళ్ళబాటతో కూడిన అడవి మార్గంలో ప్రతి రాత్రి సార్ సైకిల్ మీద ప్రయాణం చేసినప్పటికీ ఏ ఇబ్బంది కలగక పుస్తక

ప్రచురణ అయిన తర్వాత మాత్రమే సార్ సైకిల్ పంచర్ అవ్వడం విశేషం. ఆ సైకిల్ షాప్ వాడు ట్యూబును తీసి దానికి 19 పంచర్లు ఉన్నాయని అది ఉపయోగ పడదని చెప్పాడు. ఇట్టి పంచర్లైన సైకిల్ పై సార్ ఇన్ని రోజులు ప్రయాణం చేయడమే దైవలీల, గురు అనుగ్రహంకు నిదర్శనం. పూర్వం ఋషులు యజ్ఞం చేయునప్పుడు దేవతలు పరివేష్టించి ఆహుతులు అందుకుంటూ ఆ యజ్ఞం ఫలాన్ని యజ్ఞ పురుషునకు అందించి లోకానికి శ్రేయస్సును కలుగజేసినట్లుగా మనందరికీ అవధూత శ్రీ వెంకయ్య స్వామి చరిత్ర (అవధూత లీల) అందజేయడం అనేదానికి ఈ లీల పోలి ఉన్నది.

# గురు వాక్యపాలనే సాధన

శ్రీ భరద్వాజ మాష్టారు, శ్రీ వెంకయ్యస్వామి వారు, శ్రీ సాయి నాథుడు ఇచ్చిన ఆదేశాలను, స్వప్న సందేశాలను, తు| చ| తప్పక పాటించటం శ్రీ సార్ జీవితం లో అడుగడుగునా చూడవచ్చు. శ్రీ సార్ కు వారి పై గల అనన్య భక్తి, విశ్వాసాలు ఈ గురు వాక్య పాలనలో కనపడతాయి. **"చెప్పినది చెప్పినట్లు చేయటమే సేవ, తక్కిన వన్నీ వేషాలే"** అన్న శ్రీ రమణ మహర్షి వాక్యము, "**బుద్ధి పుట్టినప్పుడు చేసిది సేవ కాదు, శరీరం - మనస్సు ఉన్నది గురు సేవ కోసమే అనే భావంతో చేసేదే సేవ**" అని శ్రీ సాయి నాథుని వాక్యము శ్రీ సార్ ఆచరణ లో ప్రతిబింబిస్తాయి.

శ్రీ భరద్వాజ మాష్టారి ప్రధమ దర్శనము లో "మహాత్ములను దర్శించ మని" అడ్రస్ లు ఇవ్వగా నేను దర్శించలేను అన్న సార్ కు అందరి దర్శనము లభ్యము కావటము - దర్శించటం దగ్గర నుండి శ్రీ మాష్టారి మాట వేదం వాక్కుగా శ్రీ సార్ పట్ల పరిణమించింది.

శ్రీ మాష్టారి ప్రధమ భోధ - కాలము - మనస్సు భగవంతుడు కోరతారు అని చెప్పగా ఉదయం 6-9 గం రోజూ ధ్యానానికి కేటాయించారు. అది ఒక్క రోజు రెండురోజులు, లేదా వరం రోజులు, లేదా మధ్యమధ్యలో గహిర్ హసేర్ అవుతూ కాదు. నిష్ఠ - సబూరి ల తో 3 సం || ధ్యాన పూర్ణత చెందే వరకు అలా ఆ కాలం సమర్పిస్థూ వచ్చారు. ఇది విశేష పురుష ప్రయత్నం కాగా శ్రీ పూండీ స్వామి వారి వద్ద నుండి వచ్చిన ఆశీస్సుల ప్రభావంతో కాలగతి తెలియని స్థితి సహజమవటం గురుఅనుగ్రహన్ని మనకు తెలుపుతుంది.

శ్రీ మాష్టారి వాక్కు ఏదైనా శ్రీ సార్‌కు వేద వాక్కే అనేది ఈ క్రింది సన్నివేశాలు నిరుపిస్తాయి. శ్రీ సాయి ఉప్పు, పులుపు లేదా ఉప్పు, కారము లేదా పులుపు, కారము లేకుండా ఉండలేవా? అని స్వప్నంలో చెప్పారు. శ్రీ సార్ మాష్టారితో చెబితే మూడు మానేస్తే ముదనష్టం పోలా? అన్నారు. అంతే అప్పటినుండి ఉప్పు, పులుపు, కారం చివరి

శ్వాస వరకు మాని వేసారు. ఎంతటి గురుభక్తి, విశ్వాసము, పట్టుదల, శ్రద్ధ ఉంటే ఇది సాధ్యమో మనము ఉహించ గలము.

శ్రీ భరద్వాజ మాష్టారు చెప్పగా సత్సంగం చేయటం కలిచేడులో ఆరంభించి చేస్తూ వచ్చారు. గొలగమూడి స్వామి సమాధి వద్ద సత్సంగంలో శ్రీ సార్ వేషధారణ మాత్రమే భక్తి కాదు అని భగవద్గీతలో భక్తుని లక్షణాలు చెప్పటం గొలగమూడిలో ఉన్న కొందరికి నచ్చక సత్సంగం చేయటానికి సహకరించకుంటే విరమించుకోలేదు. శ్రీ మాష్టరితో సందేశం అడుగగా నువ్వు స్వామి లీలలు సేకరించి చిన్న పుస్తకంగా వేయి. ఆ పుస్తకం ఎక్కడికి వెళితే అక్కడ నువ్వు సత్సంగం చేసినట్లే అన్నారు. అలా శ్రీ గురు వాక్యానికి హృదయ పూర్వకంగా చేసిన సార్ ప్రయత్నానికి ఇచ్చిన గురు (శ్రీ భరద్వాజ మాస్టర్ / శ్రీ వెంకయ్య స్వామి) అనుగ్రహ పారితోషికము ఈ పుస్తక - వ్యాసంగ రచన, ఎన్నోచోట్ల ఆ పుస్తకాల ద్వారా జరిగే సత్సంగ ఫలం.

**శ్రీ వెంకయ్య స్వామి వారి ఇతర ఆదేశాలు కఠోర నియమ పాలన:**

స్వామీ! సుబ్బరామయ్య సెలవలో మీ వద్ద సేవ చేసుకొంటూ ఆశ్రమంలో ఉండవచ్చా ? అని అడిగిన సేవకులతో **"ఆయన అన్నం ఆయనే చేసుకు తినేట్లు అయితే ఉండవచ్చు"** అన్న ఆదేశం స్వామి భౌతిక సేవా సమయములో నే కాక ఆ జన్మంతము పాటించారు. ఆ ఆదేశ పాలన కై శ్రీ సార్ ఎన్ని ఇబ్బందులు లెక్క చేయక ప్రయత్నం చేసినది, ఆ ప్రయత్నానికి సంతృప్తి చెందిన స్వామి ఎలా శ్రీ సార్ చేత పరిపాలింప చేసారో మనం "గురుస్తుతి" లో చూడవచ్చు.

అట్లే శ్రీ స్వామి వారు ఒకసారి స్వప్న దర్శనము ఇచ్చి **"చమురు లేకుండా కాల్చు, చమురు లేకుండా కాల్చు"** అని చెబుతారు. శ్రీ సాయి ఇచ్చిన స్వప్న దర్శనము వలే ఈ స్వప్న దర్శనము పాటించ దలచి అప్పుడు భౌతికము గా ఉన్న శ్రీ స్వామి వారిని ఎన్ని సార్లు అడిగినా స్వామి మౌనం వహిస్తారు. సేవకులు మీకే స్వామి తెలుపు తారు అనటం తరువాత నూనె వస్తువులు ఏమి తిన్న ఆయాసం వస్తోంది అన్న గుర్తింపు కలుగ జేస్తారు. శ్రీ సార్ స్వామి ఆదేశం **"చమురు పదార్థాలు మానమని"** అని తెలుపుతారు. అప్పటి నుండి శ్రీ సార్ నూనె పదార్థాలు, నూనె మాని వేస్తారు. కానీ "మిల్క్ బ్రెడ్" తినే వారు. ఒక సారి స్పాట్ వాల్యుయేషన్ కు వెళ్లినప్పుడు ఒక వర్తకుడు (షాప్ యజమాని) చాలా డాల్డా పోసి మిల్క్ బ్రెడ్ చేస్తూ ఉన్నది సార్ కంటబడి అడిగితే నూనె లేకుండా బేకరీలో ఏ వస్తువు తయారవదు అని తెలియటంతో ఈ సన్నివేశం అంతా స్వామి కృప మరియు బోధ అని గురించి సార్ బ్రెడ్, రస్కులు తినటం మానేశారు. ఇచ్చట శ్రీ స్వామి ఆజ్ఞాపాలనకు విశేష కృషి చేస్తున్నందుకు స్వామి సంతోషించి మిల్క్ బ్రెడ్ లో నూనె / డాల్డా పోయటం చూపి తన ఆజ్ఞ పాటింపచేసారు.

శ్రీ సార్ మరల మరల చెప్పేవారు. శ్రీ స్వామి వారు తన చేత నియమ పాలన చేయిస్తున్నారు, స్వామి జలగ స్వామి - మొండి ఎద్దుల సేద్యగాడు అని. స్వప్రయత్నము - గురు అనుగ్రహాల సమ్మేళనము (అనే రెండు చేతుల) వల్లనే ఆధ్యాత్మిక రథ చక్రాలు బండి కదలటం అని. ఈ పై సన్నివేశాలు అన్నీ శ్రీ గురు ఆజ్ఞా పాలనలో గల అత్యంత అప్రమత్తత, శ్రద్ధ, పట్టుదల, విశ్వాసము తో కూడిన విశేష ప్రయత్నము - గురు అనుగ్రహము తో కూడిన సన్నివేశాల తో, మానసిక, శారీరిక, దైవిక సహాయముతో ఎట్టి దుస్సాధ్యము అయినా సుసాధ్యము చేసి మనకు మార్గ దర్శనము చేస్తున్నాయి. అట్టి గురు శరణాగతిచే శ్రీ సార్ పొందిన దివ్య స్థితి “శ్రీ సుబ్బరామయ్య సార్ తో భక్తుల అనుభవాలు” అను పుస్తకంలో చూడవచ్చు.

**పి. వేంకటేశ్వరరావు గారు, హైదరాబాదు, శ్రీ సార్ గూర్చి ఇలా చెపుతున్నారు :**

ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి జన్మించి మిశ్రమ కర్మలు, ద్వంద్వ భావాలతో జీవనం గడపడమే సాధారణం. కానీ కొందరు వారి జీవితాన్ని భగవత్ సాధనగా మార్చుకుంటారు. వారు చేసే ప్రతి పని ఒక యజ్ఞంగా, ప్రతి మాట ఒక శ్రుతి గా, ప్రతి శ్వాస ఒక నామస్మరణగా మారుతుంది. అటువంటి అరుదైన జీవన మార్గాన్ని ఆశ్రయించిన వారిలో సుబ్బరామయ్య సార్ ఒకరు. సుబ్బరామయ్య సార్ జీవన విధానమే బోధనగా నిలిచింది. ఆయన జీవితం – పరిశీలించాల్సినది, ఆచరించాల్సినది.

వెంకయ్య స్వామి మరియు భరద్వాజ మాస్టర్ వారి అనుగ్రహంతో సార్ జీవితంలో ప్రవేశించినవి నిశ్చల విశ్వాసం, భక్తి మార్గం, ధర్మపాలన, ఆహార నియమ నిష్ట – ఇవన్నీ సాదా జీవన శైలిలో పరమార్థాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని అద్దం పట్టే అంశాలు.

సార్ జీవితం ద్వారా భక్తి మార్గాన్ని సరళంగా చూపించి, సాధారణ జీవితంలోనే సాధన సాధ్యమయ్యే మార్గాలు గుర్తుచేసి, నిష్కామ జీవన మార్గ వెలుగుతో అందరి జీవితాలలో దివ్యత్వాన్ని నింపారు. సార్ చేసే ప్రతి చిన్న పని – నామస్మరణతో సమర్పితమైనదిగా ఉండేది. ఆయన చెప్పిన మాటలు తక్కువైనా, చూపిన మార్గం తేటతెల్లమైనది. "సాధన అనేది మన హృదయపు తలపులతో మొదలవుతుంది" అనే సత్యాన్ని ప్రతిబింబిస్తుంది.

**ఉదాహరణకు నామస్మరణతో ప్రసాద సమర్పణ – సార్ జీవనం సాధనగా మారిన విధం:**

వెంకయ్య స్వామికి ప్రతి ఉదయం నాలుగు ఇడ్లీలు తీసుకుని, నామస్మరణ చేస్తూ, కాలినడకన స్వామి దగ్గరకు వెళ్లి సమర్పించేవారు. నామము జపించుకుంటూ నడుస్తూ, మధ్యలో మనస్సు మరలినా, వెంటనే మరల వెనుకకు నడిచి వచ్చి నామాన్ని చెప్తూ ముందుకు వెళ్లేవారు. తన దృష్టిని తిరిగి సాధన వైపు మళ్లించేవారు. ఇలా జీవితాన్ని సాధనగా చేసుకున్నారు.

**రుచులపై నిరాసక్తత – ఆహార నియమ నిష్ఠ**

సార్ యొక్క ఆహార జీవిత విధానమూ సాధనామయమే. ఉప్పు, కారం, పులుపు, నూనె లాంటి రుచులను పూర్తిగా వదిలి, సహజ సిద్ధమైన కూరగాయలతో మాత్రమే ఆహారం స్వీకరించేవారు. కాలానుగుణంగా వచ్చే తమ్మకాయలు, మునగకాయలు, ఇంటి వెనుక పెరిగే ఆకుకూరలే వారి ఆహార ప్రధానమైనవి. ఒకే కూరను వరుసగా అనేక రోజులు స్వీకరించడంలో అసహనం లేకుండా, రుచులకు పోకుండా ఆహారం తింటూ ప్రతిక్షణం సాధన చేసేవారు.

**శ్రీ భరద్వాజ మాస్టర్ గారు ధ్యానయోగ సర్వస్వములో వ్రాసిన వ్యాసము ద్వారా మనకు వేస్తున్న చురక:**

మన జీవితములో సాధన ఒక భాగం అవటం కాదు. సాధనలోనే జీవితము ఒకభాగం కావాలి. ఈ రెండింటి భేదాన్ని జాగ్రత్తగా గమనించాలి. మన జీవితంలో భోంచెయ్యటం, స్నానం చెయ్యటం ఎలా భాగాలవుతాయో అలా సాధన కూడ ఒక భాగం అవాలంటారు చాలామంది. కానీ యిది సరికాదు. ఎందుకంటే ఈ భోజన స్నానాదులు మనము సుఖంగా జీవించటానికి. అప్పుడు ఎన్నో భాగాలలో సాధన ఒక భాగం అవుతుంది. కాని మనం సాధన కోసమే జీవించినపుడు అది సాధనలో పరిపూర్ణత. అంటే ఉదాహరణకు జీవితము సుఖంగా గడపడానికి ఉద్యోగం చెయ్యటం వేరు, అంతా వదిలి పూర్తిగా తపస్సులో ఉండేందుకు మనము యోగ్యం కాలేము గనుక, ఇప్పుడు అందుకు సిద్ధమయ్యేందుకు గట్టిగా యత్నిస్తూ ఈ లోపల ఎవరిమీద ఆధారపడకుండా మన జీవనోపాధి జరగాలి గనుక ఉద్యోగం చెయ్యటం వేరు. అందుకని నిజమైన సాధకుడు తన జీవితాన్నంతా సాధన కనుకూలంగా మలచుకొంటాడు. అంటే తన సాధనకు అడ్డురాని ఉద్యోగం, స్నేహితులు, జీవిత విధానం, దినచర్య అన్నీ తను వేసే ప్రతి అడుగు తన గమ్యం వైపే వేస్తాడు. తను దేనికోసం జీవితాన్ని గడుపుతున్నాడో దానికోసం సర్వాన్ని వదలిపెట్టడానికి తాను ఎప్పుడూ సిద్ధంగా వుంటాడు. **అలాకాక రోజూ సక్రమంగా ధ్యానం చెయ్యడానికి వీలు, time దొరకటము లేదనో, తాము జీవితములో పూర్తి చేయవలయుననుకొన్న పనులు కొన్ని పూర్తిచేసి సాధన చేస్తామనో, జీవితము బాగా అనుభవించి (ఇక అనుభవింపయోగ్యంగాని ముసలి వయస్సులో) బాగా సాధన చేస్తామనో అనేవాళ్ళకు అసలు సాధన అంటే ఇంకా తెలియలేదన్నమాట. అసలు మానవుడు వుండేదే దేవుడవటం కోసం - విత్తు వుండేది చెట్టవడం కోసమయినట్లు. కాబట్టి సాధనలో జీవితం ఒక భాగమవ్వాలి అని తెలుసుకొని తీరాలి. ఇది తెలుసుకొనకుండా, సాధించకుండా, ఈ లోపల సాధన, ముక్తి అని మాట్లాడటం చిన్న పిల్లవాడి మాటలవలె అర్థరహితం. ఇది సాధిస్తేనే సాధన మొదలైనట్లు.**

# తమ జీవితాన్ని సాధనలో భాగంగా చేసిన శ్రీ సార్

**సార్ జీవితంలో సాధన ఒక భాగం కాలేదు. దానికి విరుద్ధంగా సాధనలో జీవితం ఒక చిన్న భాగం అయింది అనే విషయాన్ని నగేష్, బెంగళూరు ఇలా పంచు కుంటున్నారు.** సార్ జీవితం తీవ్రమైన ఆత్మ పరిశీలన, ప్రాణాలను సైతం ఫణంగాపెట్టి ధ్యేయం వైపు పయనించడం అణువణువునా కనిపిస్తాయి

**ఆచరణత్మక వేదాంతం :**

స్వామి వివేకానంద చెప్పిన అనుష్టాన వేదాంతం అంటే ఆచరణాత్మక వేదాంతం- కేవలం మాటల్లో కాకుండా తన నిత్య నడవడికలో ఆధ్యాత్మికతను ఆచరించి చూపించడం శ్రీ సుబ్బరామయ్య సార్ జీవితాన్ని గమనించిన ప్రతి ఒక్కరికీ ప్రస్ఫుటిస్తుంది. శ్రీ సుబ్బరామయ్య సార్ ని ఎవరు చూసినా ఆయన ఒక భక్తుడిగా కూడా కనిపించరు. ఆయన మహాత్ముడు అంటే అస్సలు నమ్మరు. అతి సామాన్యంగా వేష ధారణ: షర్టు ఒక కలరు, గుండీలు వేరొక కలర్, పాకెట్ ఇంకొక కలర్. అతి సామాన్యమైన పాతకాలంనాటి నులక మంచం, ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం నుండి ఉండే మడత కుర్చీ. ఈయనకు ఏమాత్రం తీసిపోని అతి సామాన్యంగా జీవించే భార్య. ఇది వారి జీవిత విధానం. వెంకయ్య స్వామి వారు చెప్పిన సంపన్నత్వం, సాధారణత్వం ఉట్టిపడుతూ. మనం భౌతికంగా కనిపించే వస్త్రధారణ, సామాన్యంగా జీవించే జీవితపు అలవాట్లు సాధారణత్వం అనుకుంటాం. కానీ ఆధ్యాత్మిక సంపన్నత్వాన్ని బయటకు తెలియనివ్వకుండా అతి సాధారణంగా జీవించటం అంత సులభం కాదు, అత్యంత కఠినం. ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నతంగా మహాత్మునిగా ఆ స్థాయిలో ఉంటూ బయటకు కనిపించకుండా అతి సామాన్యంగా కనీసం ఒక బొట్టు కూడా పెట్టుకోకుండా తన ప్రవర్తనలో ఇసుమంతైన ఒక భక్తుడిగా కనిపించే తాపత్రయం లేకుండా జీవించటం. తన మాట, ప్రవర్తన ఇతరులతో సంభాషించేటప్పుడు ఏమాత్రం తన ప్రత్యేకతను చూపించకుండా అతి ప్రాథమిక స్థాయి మనుషులతో కూడా వారిలో కలిసిపోయి తన మహత్యాన్ని మరుగుపరచటం ఈ మహాత్మునికే చెల్లింది. ఒక్కోసారి ఆయన చెప్పేటప్పుడు “నీ వయసులో నాకు నీ అంత మంచి బుద్ధులు లేవు” అని మనల్ని ఒక మెట్టు పైకెక్కించేస్తారు కానీ వారు మాత్రం బయటపడరు.

భగవంతుని అనుగ్రహాన్ని పొందటానికి మనలో, మన ఆలోచనల్లో నిజాయితీ అవసరం. కేవలం మాటల్లో కాకుండా మానసిక సోమరితనాన్ని దరికి రానివ్వకుండా సుబ్బరామయ్య సార్ చేసిన పురుష ప్రయత్నం పరిశీలిద్దాం.

**సోమరితనం లేకపోవటం :**

సార్ రెండువైపులా పనిచేశారు ఒకటి ఒక గురువుకి శిష్యుడిగా, రెండవది తనను ఆశ్రయించిన వాళ్ళకి గురువుగా.

సుబ్బరామయ్య సార్ తన చిన్నప్పటినుండి శారీరక, మానసిక సామరితనాన్ని దరికి రానివ్వలేదు. శారీరక సోమరితనం మనిషికి కనిపిస్తుంది. మానసిక సోమరితనం ఇతరులకు తెలియదు. ఇష్టా-అయిష్టాలను జయించాలంటే మానసిక సోమరితనాన్ని ఎదుర్కోవాలి. మనకి ఇష్టం లేని, మనసుకి ఇష్టం లేని, బాధ పెట్టే పనులను చేయాల్సి వస్తుంది. గురు ఆజ్ఞలను మనకు ఎంత అసౌకర్యంగా ఉన్నా మనసుని శరీరాన్ని ఎదిరించి చేయాల్సి వస్తుంది.

సుబ్బరామయ్య గారు చిన్నప్పటినుండి మనుషుల్లో దేవుడిని చూసే అలవాటు ఉండేది. ఊరిలో దేవాలయాలను బాగు చేయడం అందులో భాగంగా ఒక పాడుపడ్డ శివాలయంలో చిన్నప్పుడే దానికి అభిషేకం చేయడం ఒకటి. శ్రీ భరద్వాజ మాష్టారి సాంగత్యం లభించాక కూడా తనతో పాటు ఇతర భక్తులకు వండి వడ్డించటం. నిద్రాహారాలు లెక్కచేయకుండా మందిర నిర్మాణము, శ్రీ మాష్టారి నోటినుండి వచ్చిన ఏ ఆదేశము కొరకు అయినా పనిచేయటం. గురు ఆదేశం మేరకు మనసుకు నచ్చినవి కాకుండా ఉప్పు, కారం పులుపు లేని ఆహారాన్ని జీవితం చివరి వరకు తనే వండుకొని తినడం. రుచి లేని ఆహారాన్ని తినటంలో మనసుతో ఎంత పోరాటం ఉంటుంది. శరీర సుఖాన్ని త్యజించి అనారోగ్యంగా ఉన్నా, అసౌకర్యంగా ఉన్నా భక్తులందరికీ ప్రీతితో ఆశ్రయం కల్పిస్తూ సేవ చేశారు. సాయి మాస్టర్ స్కూల్ రిజిస్ట్రేషన్ విషయాలలో ఇబ్బంది విన్నవించుకున్నప్పుడు, శ్రీ సార్ సందేశం స్కూల్ పిల్లలకు, నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు ఇచ్చినప్పుడు, శివ తన ఆఫీసు విషయాలలో శ్రీ సార్ సలహా అర్థించినప్పుడు, కొందరు భక్తులు తన ఆఫీసు, సంస్కారాల మార్పుకై లేదా వారి ఇబ్బందులు శ్రీ సార్ కు విన్నవించుకునేటప్పుడు శ్రీ సార్ ఎంతో ఓపికతో కూర్చొని విని కావలసిన సలహాలు ఇస్తూ తమ అమూల్యమైన సమయం - సాంగత్యం ప్రసాదించేవారు.

తనని ఆశ్రయించిన వారికి వారికి తెలియకుండానే మానసిక సోమరితనాన్ని చేయించడంలో వారిచేత వారికి తెలియకుండానే చేయించడంలో సిద్ధహస్తులు. శ్రీ స్వామి వద్ద శ్రద్ధగా చాలా రోజులు ప్రదక్షిణలు చేయించడం, ప్రత్యేక సమస్య - మార్పు అవసరమైనప్పుడు ఆహారము నియమిచి సైతం ప్రదక్షిణలు చేయించడం, ఇంకా సంవత్సరాల తరబడి ప్రతి వారం గొలగమూడి వచ్చేటట్లు చేయించడం, దీక్షలు చేయించి వారి కర్మలు తొలగించి వారి జాతకాన్ని మార్చి ఉన్నతంగా వారి గతిని నిర్దేశించటం మొదలగునవి చాలా ఉన్నాయి.

**పరోక్ష సన్నిధిని అనుభవించటం :**

గురువు ప్రత్యక్షంగా ఉండేటప్పుడు జాగ్రత్తగా నడుచుకోవడం కంటే శరీరంతో లేనప్పుడు ఏమరుపాటుగా లేకుండా ఉండటం చాలా కష్టం. సార్, శ్రీ వెంకయ్య స్వామి వారు సమాధి చెందిన తర్వాత కూడా శరీరంతో ఉన్న మనిషికి ఎలా వేడి నీళ్లతో స్నానం చేయిస్తామో అలా స్వామివారి సమాధికి వేడినీళ్లతో శ్రద్ధగా స్నానం అంటే అభిషేకం చేసేవారు, పూజలో మమేకమై ఏకాగ్రతతో ఉండేవారు. నిరంతరం గురువు మనలను గమనిస్తున్నారనే ఎరుక కలిగి మానసిక సన్నిధిని అనుభవించేవారు. దానికి తగినట్టు శ్రీ స్వామి మౌన బోధను హృదయగతం చేసుకుని తనను తాను మలచుకునేవారు.

**క్రియా శూరత్వం :**

భరద్వాజ మాస్టర్ గారికి తన బలహీనతల గురించి చెప్పేటప్పుడు సార్ కి "వాచా శూరత్వం కాకుండా క్రియా శూరత్వాన్ని చూపించమని" చెప్పారు. స్వామి వివేకానంద చేసినట్లు తనకు తన తప్పులను తెలుసుకుని వాటికి ప్రాయశ్చిత్తాలను విధించుకొని, తన కోరికలోని నిజాయితీని చూపించుకుంటే గురు అనుగ్రహానికి పాత్రులు అవుతామని ఎన్నోసార్లు ఆచరించి చూపించారు. ఎన్నోసార్లు ఉపవాసాలు, ప్రదక్షిణలు, సెల్ఫ్ ఇంపోజ్డు పనిష్మెంట్ లను ఇచ్చుకునే వారు.

తనను ఆశ్రయించిన వారికి కూడా వారి తప్పులు తెలుసుకొని తన దగ్గర ఒప్పుకొని సరైన మార్గంలో వెళ్ళేటట్లు చూసేవారు. తప్పు తెలుసుకోలేకుంటే సూక్ష్మాతి సూక్ష్మమైన రూపంలో మనసుకు, బుద్ధికి తెలియపరచి తమ దగ్గర వ్యక్తపరిచే దాకా ఊరుకునే వారు కాదు. ఉదాహరణకు ‘నువ్వు’ అనే బదులు ‘మీరు’ అని సంబోధించటం, మౌనంగా ఉండటం, ‘నన్నెందుకు అడగటం, ‘దేవుడిని అడుగు’, ‘నేనేమైనా దేవుడునా?’ అని చెప్పడం ద్వారా మన దోషాలని ఎరుక పరిచేవారు.

**స్వామి ఇచ్చిన ఆదేశాన్ని పాటించకుంటే పుట్టగతులు ఉండవు!**

గొర్తి రవి సార్ తనను ధర్మమార్గంలో నడిపించిన అనుభవములలో ఒకటి ఇక్కడ పంచుకుంటున్నారు.

నేను బెంగుళూరులో నా M. Tech. పూర్తి అయిన తర్వాత PhD ఎక్కడ చెయ్యమంటారు? అని శ్రీ వెంకయ్యస్వామివారి ఆదేశాన్ని అడుగుతూ స్వామి పటం వద్ద చీటీలు వేసాను. అందులో, (1) ఇండియాలోనే PhDకి ప్రయత్నం చేయమని, (2) ఇతర దేశాలలో PhDకి ప్రయత్నం చెయ్యమని, (3) M. Tech. డిగ్రీతోనే టీచర్ ఉద్యోగానికి ప్రయత్నం చేయమని చీటీలు వేసి, స్వామివారి ఆదేశాన్ని తెలపమని ప్రార్థిస్తే, ఇతర దేశాలలో PhD చెయ్యమని స్వామివారి ఆదేశం వచ్చింది. దానితో ఇతర దేశాలలో PhD చేయడానికి కావలిసిన పరీక్షలు వ్రాసి, అమెరికాలోనూ, ఇంకా మరికొన్నిచోట్ల అప్లై చేసాను. కానీ నా M. Tech. పూర్తయ్యే సమయానికి ఎక్కడా సీటు రాలేదు.

నా M. Tech. గైడు, నేను ఒప్పుకుంటే బెంగుళూరులోనే (IIScలో) నన్ను PhDకి తీసుకుంటానని చెప్పారు. ఇతర దేశాలలో PhD సీటు రాలేదు కాబట్టి, ఇంక బెంగుళూరులోనే జాయిన్ అవుదామా అని అనిపించి, సార్‌ని ఈ విషయమై అడిగాను. అప్పుడు సార్, "**మనకు నచ్చినట్లు చేద్దామనుకుంటే, అలాంటప్పుడు మీ ఆదేశం ఏమిటని స్వామిని అడగకూడదు. ఆయనను ప్రార్థించుకుని, మనకు తోచిన ప్రయత్నాలు చేసుకుంటూ పోవాలి. అలాకాక, మనము ప్రత్యేకంగా, ఆయన ఆదేశం అడిగితే, ఆయన ఆజ్ఞ ప్రకారం తు.చ. తప్పకుండా ప్రయత్నించాలి. ఒకసారి స్వామి సందేశం ఇచ్చాక, దాని ప్రకారంకాక, మన ఇష్టం వచ్చినట్లు చేస్తే మనకు పుట్టగతులు ఉండవు!**" అని చెప్పి ఆపేసారు.

సార్ చెప్పిన ఆ మాటలకు, నా గుండెలో రాయి పడినట్లైంది. ఇక ఇండియాలో PhD ప్రయత్నాలు ఆపివేసి, టెంపరరీగా ప్రోజెక్ట్ అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యి, ఇతర దేశాలలో PhD అవకాశాలకోసం ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉన్నాను. కొద్దికాలం తర్వాత, ఊహించని విధంగా, స్విట్జర్లాండ్‌లో EPFL అనే చాలా మంచి యూనివర్సిటీలో PhD సీటు వచ్చి, అక్కడ జాయిన్ అయ్యి, PhD పూర్తి చెయ్యడం జరిగింది. ఇప్పుడు IIT-తిరుపతిలో అసిస్టెంటు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాను.

ఆ రోజు సార్ అంత గట్టిగా స్వామి ఆదేశం పాటించడం గురించి హెచ్చరించి, ఆ ఆదేశాన్ని పాటించేటట్లు చేయకుంటే, నన్ను గురువు మాటను ఉల్లంఘించి నడుచుకున్న పాపం, బాధ జీవితాంతం వెంటాడేవి. ఇటు లౌకికంగా చూసినా, ఎంతో గొప్ప అవకాశాన్ని కోల్పోయి ఉండేవాడిని. ఈ విధంగా సార్ నన్ను ఇటు లౌకికంగానూ, అటు ధర్మం తప్పి నడుచుకోకుండాను సరి అయిన మార్గంలో నడిపించారు. అలా మనలను నడిపించడం - ధర్మాచరణ సహజసిద్ధమైపోయిన సార్‌లాంటి వారికి తప్ప సామాన్యులకు సాధ్యమయ్యే విషయం కానే కాదు.

**శ్రీ రామ కృష్ణ బట్టు, చెన్నై ఇలా పంచుకుంటున్నారు.**

**లెటర్స్ ద్వారా, సత్సంగం ద్వారా :**

దేవుడా... నా జీవితం ఎటు పోతోంది, ఏమి తెలియట్లేదు అనే వాళ్ళకి ... "సర్వానికీ కర్త భగవంతుడే" అని తాము చిన్నప్పుడు ఉన్న కష్ట పరిస్థితుల నుండి ఇప్పటి గౌరవ ప్రదమైన జీవితం పొందటానికి భగవత్ కృపే కారణం అని, అందుకే తమ పిల్లల భవిష్యత్తు ఎట్లా అని విచారించకుండా వారికి మంచి నడవడి, విద్యా బుద్ధులు నేర్పించటమే మన కర్తవ్యమనీ... అలా మానవ ప్రయత్నం చేస్తూ, భగవంతుని కృప కొరకు ఆయనకు మన కాలము, మనస్సు ఇవ్వాలని, అవి ఇస్తే అనంతమైన ఫలితాల్ని పొందగలమని తమ జీవిత అనుభవాల ద్వారా నిరూపణ ఇచ్చారు. మన కాలము, మనస్సు సమర్పించడానికి రెగ్యులర్ గా హారతులు అటెండ్ అవ్వటం, సత్సంగంలో

పాల్గొనటం, ఆ రకంగా డైలీ రొటీన్ ని క్రమశిక్షణతో తీర్చిదిద్దుకోవటం నేర్పించారు. ఇంకా నెలకొకసారన్నా స్వామి / గురు దర్శనం చేసుకోవాలని చెప్పారు.

అయినా గానీ మాకు అంతులేని ఆలోచనలతో నిద్ర పట్టటం లేదు అంటే తాము నిద్రించటానికి "సమాధి మందిరంలో ఉన్న వెంకయ్యస్వామి విగ్రహాన్ని లేదా స్వామి సజీవ రూపాన్ని ధ్యానిస్తానని", మనల్ని కూడా అలా చేయమని సులభ సూత్రం చెప్పారు.

**ఈ కురిసే వర్షం అంతా స్వామి తీర్థం కాదా** అని మాష్టరు గారు అంటే "**మంచి నీరు త్రాగినప్పుడంతా 'పంచభూతాత్మ స్వరూపాయ నమః' అని స్మరిస్తూ త్రాగడం**. ఆ భావాన్నే మరింత వివరంగా **"ప్రసాదం అంటే గుళ్లో పెట్టింది మాత్రమే కాదు, మనం రోజూ తినే అన్నం, కూరలు తో సహా పీల్చే గాలి కూడా భగవత్ ప్రసాదమే" అని గుర్తింపు ఇవ్వటం.**

**మార్గదర్శనం:**

గుడ్డు ముందా పిల్ల ముందా అని టైం వేస్ట్ చేసే వాళ్ళకి భగవద్గీత నుండి "మాయ ఉండగా అనన్యాశ్చింతయంతో మాం ఎలా కుదురుతుంది" అని తామే ప్రశ్నించి... మన పాపం కంటే పుణ్యం బరువు ఎక్కువైనప్పుడు భగవంతుడు మన రక్షణ భారం వహిస్తాడనీ, మళ్ళీ పుణ్యం అంటే ఏమిటి అని ప్రశ్నించి "పరోపకారం పుణ్యం, పర పీడనం పాపం" అని అంటే ఇతరులు నీకు ఏమి చేయాలనుకుంటావో అది ఇతరులకు చేయమని, ఏమి చేయకూడదు అనుకుంటావో అది చేయకుండటమే పుణ్యం అనీ వివరించారు. (ఇది "Love Thy Neighbor as Thyself" అనే బైబిల్ వాక్యాన్ని పోలి ఉంది). ఇదే భావాన్ని మరింత ఘాటుగా "ఎప్పుడూ కడుపుకి తినటమేనా? ప్రసాద్ ఇక్కడికి వచ్చి ఎంత సేవ చేస్తాడో తెలుసా?" అని మందలిస్తూ "స్వామికి సేవ చేస్తేనే నిజమైన ఆనందం లభిస్తుందని", అందుకే స్వామి సేవ చేయాలని గట్టిగా బోధించారు.

# ధర్మాచరణ

## ధర్మపాలనలో అపూర్వ స్థిరత – కరెంట్ మీటర్ ఘటన

కొత్త ఇంటికి కరెంట్ కనెక్షన్ కోసం అప్లై చేసిన సమయంలో, లైన్మన్ "మీటర్ రావటం సమయం పడుతుంది, మీటర్ లేకుండానే విద్యుత్ వినియోగించవచ్చని" సూచించినా – సార్ ధర్మపాలనలో ఏమాత్రం నర్మగర్భంగా వ్యవహరించలేదు. సార్ దానికి అంగీకరించక రెండు నెలలు చీకటిలోనే ఉండి మీటర్ బిగించిన తర్వాతే కరెంటు వాడుకున్నారు. ఈ విధంగా సార్ ధర్మాన్ని ఎలా పాటించాలో మనందరికీ సార్ పాటించి చూపించారు.

**శ్రీ రామ కృష్ణ బట్టు, చెన్నై ఇలా పంచుకుంటున్నారు.**

**మన కర్తవ్యం:**

మనం స్వామికి సమయం కేటాయిస్తే, మన బాధ్యతలన్నీ స్వామి చూసుకుంటారని “గురు స్తుతి” ద్వారా (10 కిలోల బియ్యం నెల రోజులు రావటం, కట్టెల బండి నేరుగా ఇంటి దగ్గరకే వచ్చి అమ్మటం) ఘంటాపథంగా చెప్పటం. అప్పుడే కాదు ఇప్పుడు కూడా స్వామికి హారతులు మొదలైన సేవల ద్వారా సమయం ఇచ్చినప్పుడు, కష్టమనుకున్న ఆఫీస్ వర్క్ కూడా చిత్రాతి చిత్రంగా పూర్తి అవ్వటం లేదా అప్పటికి గండం గట్టెక్కే విధంగా ఏదో లీల జరగటం మనం గమనించవచ్చు.

**అనవసరపు భయాలు తొలగించటం:**

వాస్తుకి ప్రాముఖ్యత నిచ్చినా, దాని కంటే నీతి, నిజాయితీలే మనల్ని కాపాడతాయి అని "ధర్మో రక్షతి రక్షితః" అని అన్యాయార్జిత సొమ్ముతో ఇల్లు కట్టుకున్న వాడు ఎట్లా (సంపద, ఇల్లు, ఆరోగ్యం, చివరికి వంశం కూడా) నష్టపోతాడో దృష్టాంతం ఇస్తూ, తరువాతి కాలంలో ధర్మంగా ఉండేవాడు అదే ఇంటిలో హాయిగా ఎట్లా జీవించాడో వివరిస్తూ అనవసరపు భయాలు తొలగించటం.

**శివ శంకర్, శివ రత్నం (గొలగమూడి) తమ్ముడు ఇలా పంచుకుంటున్నారు.**

2008-2009 లో గూడూరు లో లెక్చరర్ గా పని చేసేటప్పుడు కూడా ప్రతి ఆదివారం సార్ ను దర్శించుకుంటూ ఉండేవాడిని.

శ్రీ సార్ నాచే ధర్మాచరణ ఎలా చేయించి, దానిని ఎలా ఆశీర్వదించారో ఒక సన్నివేశంలో పంచుకుంటాను. గూడూరులో ఉద్యోగం చేసేటప్పుడు నాకు ఒకసారి ఆత్మకూరు లో ఒక ఇంటర్ కాలేజ్ లో ఎగ్జామ్స్ ఇన్విజిలేషన్ డ్యూటీ పడింది. నేను చూస్తుండగానే కాలేజీ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాలు తెచ్చి కాపీ కొట్టించమని, వారికి బెస్ట్ మార్క్స్ వచ్చేలా చేయమని stress చేశారు. మా కాలేజీ ప్రిన్సిపల్ కు కూడా చెప్పి, ఆయనతో నాకు చెప్పించారు. అది వీలు కాదని ఖచ్చితంగా చెప్పాను. స్టూడెంట్స్ ల్యాబ్ చేసి వ్రాయగలిగిన అంత వ్రాయడమే అని చెప్పాను. అలానే ఖచ్చితంగా ఉండడం జరిగింది. వాళ్లు ఎక్కువ ఇచ్చే డబ్బులు ఇవ్వము అన్నా, మరి ఏం చెప్పినా వినక పోవడంతో రూమ్ లో కొట్టడానికి రెడీ అయినట్లు అరవటం మొదలు పెట్టారు. నేను ధైర్యంగా ఎదురు నిలబడేటప్పటికి వాళ్ళు కాళ్ల బేరానికి వచ్చారు. కానీ నా డ్యూటీ మేరకు చేసి వచ్చేసాను. తర్వాత ఈ విషయం శ్రీ సార్ కు చెబితే, “నీవు అలాగే ధర్మానికి అంటి పెట్టుకొని ఉండు. నువ్వు ఎక్కడ ఉన్నా స్వామి రక్షణగా ఉంటారు” అని సార్ చెప్పారు. **ధర్మాచరణ చేయగల శక్తి శ్రీ సార్ సాంగత్య ప్రభావమే, ప్రసాదమే.**

# విశ్వాసం

**పి. వెంకటేశ్వరరావు గారు, హైదరాబాదు, శ్రీ సార్ గూర్చి ఇలా పంచుకుంటున్నారు :**

**విశ్వాసాన్ని నిరూపించిన ఘట్టం – శేషయ్య సంఘటన**

శ్రీ సార్ కుమారునికి చదువు, లెక్కించటం మొదలుగునవి తెలియకుంటే శ్రీ సార్ తో స్వామి వారిని అతనికై అడగమనటం, శ్రీ సార్ "శేషయ్య సర్వభాధ్యతలు స్వామే వహించమని ప్రార్ధించటం" శ్రీ సార్ రచించిన "గురుస్తుతి" లో చూడవచ్చు. శేషయ్యను 10 సంవత్సరాల వయసులో ఒక పిల్లవాడు గొలగమూడి నుండి తీసుకువెళ్లి నెల్లూరు సెంటర్లో వదిలిపెట్టి దూరంగా శేషయ్య అక్కయ్య సుమతీ గారు ఉన్న ఇల్లు చూపించి వెళ్ళమని అతను వెళ్ళిపోయాడు. అలా చెప్పినట్లు వెళ్లలేక శేషయ్య తప్పిపోయాడు. అదే సమయంలో శ్రీ సార్ స్వామి సేవలో అవిరామంగా నిమగ్నమై ఉన్నారు. సార్ సతీమణి పిల్లవాడు ఇంకా ఇంటికి రాలేదు, చేస్తున్న పారాయణలు అన్నీ ఏమైనాయి అని సార్ దగ్గర వాపోయిన సార్ స్వామి మీద విశ్వాసంతో *(నెల్లూర్ మహా నగరంలో ఎక్కడని వెతికేది? స్వామే తీసుకురావాలి అనే భావనతో)* మూడవ రోజుకి స్వామి పంపిస్తారు లేకపోతే నెల్లూరులో వెతకటానికి వెళతాను అని అన్నారు. శ్రీ సార్ శేషయ్యను వెతకటానికి నెల్లూరు వెళ్లకుండా గొలగమూడిలోనే ఉన్నారు. ఒంటరిగా వెళుతున్న శేషయ్యను వారి బంధువురాలు కేవలం స్వామి ప్రేరణ వల్ల ఇంటి బయటకు వచ్చి తుక్కు వేస్తూ చూడటం, తరువాత గొలగమూడికి పంపటం జరిగినది. ఇలా సర్వసమర్ధుడైన స్వామి అందరిలో ప్రేరణ పెట్టి ఏమీ తెలియని శేషయ్యను రక్షిస్తూ సరైన టైంలో సరైన వ్యక్తిని ప్రేరణ పెట్టి కాపాడారు. గురుసేవలో మన ప్రయత్నం స్థిరమైతే ఎంతటి అద్భుతమైన గురు అనుగ్రహం రుచి చూపిస్తారో తెలిపే అనుభవం ఇది. వాళ్ళు ఉండే దాన్ని బట్టి కదయ్యా మనం ఉండేది అన్న స్వామి మాటలు గుర్తు ఉంచుకొని విశ్వాసంతో అంతా ఆయన దివ్యలీల అని భావిస్తూ, స్వధర్మం, కర్తవ్యము, గురుసేవల నుండి మరలక సంతోషంగా జీవితాన్ని గడిపితే, మన భాద్యతలు స్వామి ఎలా పాలిస్తారో ఈ అనుభవంలో చూడవచ్చు.

**శ్రీ రామ కృష్ణ బట్టు, చెన్నై ఇలా పంచుకుంటున్నారు.**

**భక్తి, విశ్వాసం పెంపొందించటం:**

Wavering మైండ్ తో ఎప్పుడూ సతమయ్యే మనకి తన పరంగా చెబుతూ స్వామి ఎట్లా రక్షిస్తున్నారు అనే విశ్వాసం పెంచటం.

పిలిస్తే పలుకుతాడు స్వామి అని ఘంటాపథంగా చెబుతూ, నిరూపిస్తూ (Floods, అబ్బాయి ఆక్సిడెంట్, పాప నిచ్చెన నించి పడటం, etc.), స్వామి మీద విశ్వాసం పెంపొందిచటం. ఒక స్టేజికి వచ్చాక స్వామిని ఏమి అడగకుండా ఆయనకి సర్వస్య

శరణాగతి (సరెండర్) అయి జీవించాలి అని చెప్పటం, (అన్నిటికీ స్వామి మీద ఆధార పడాలి అనే భావానికి ప్రతీకగా శ్రీ స్వామి ఆదేశించిన రోజు నుండి ఉద్యోగానికి voluntary retirment ఇచ్చేశారు. ఆ సమయానికి కూతురు పెళ్లి కూడా అవలేదు అయినా ఏ భయమూ లేదు. చూడ గలిగితే అనుక్షణం స్వామి రక్షణ ఎలా ఉందో observe చేసుకోగలగటం నేర్పించారు.

# నిష్కామ కర్మ - గురు సేవ

**సాధారణత్వం:**

సర్వజ్ఞత్వం (తన పేరు తెలుసో లేదో అనుకునే బట్టు, శేషుల మనసులలోని సందేహాలకు వెంటనే సమాధానం ఇవ్వటం),

సర్వవ్యాపకత్వం (చెన్నై 2015 వరదల సమయంలో 'సార్ నాకు భయం వేస్తోంది, ఈ పరీక్ష ఇక చాలు, రక్షించండి' అని శ్రీరామకృష్ణ భట్టు మనసులో ప్రార్థించిన వెంటనే వర్షం ఆగిపోవటం).

సర్వ సమర్థత (నీకు ఏమి కావాలి?... అంటే నీవు కోరిన వరాలు ఇవ్వగలను అని అనగలిగే స్థితి లో) ఉండి కూడా, మన ఊహకు కూడా అందని సాధారణత్వం ప్రదర్శించారు.

స్వామి ఆరాధన రోజున ఎంతో మంది భక్తులు వస్తారు కదా, కనీసం వారి ముందైనా పట్టు పంచెలు, ఉత్తరీయాలు ధరించేది లేదు... అంతమందికి అన్నదానం చేస్తున్నా... ఎప్పుడూ ధరించే ఆ ఖాకీ / బులుగు ప్యాంటు, ఆ ముతక బనీను తప్ప తాము ప్రత్యేకంగా కనిపించాలని ఏనాడు అనుకోని సాధారణత్వం అది.

**నగేష్, బెంగళూరు ఇలా పంచు కుంటున్నారు.**

**అప్రకటిత ప్రేమ :**

నిజమైన ప్రేమ బయటకు-అందరిలో ప్రకటించటం ఇష్టపడదు. “భక్తి” ప్రేమ కంటే ఎంతో ఎక్కువ. తన గురువుగారి మీద భక్తిని ఆచరణలో చూపించటం అంటే "నీ భక్తుల దాసిని" అనటంలో భక్తులకు సేవ చేయటం, వారికి సహాయ పడటం ఎవరికి తెలియనివ్వకుండా చేసేవారు. ఉదాహరణకు ఒక మెడికల్ స్టూడెంట్ ధన సహాయం చేయటం, అనారోగ్యంతో ఉండేవారికి షెల్టర్, ధనము ఇవ్వటం అలా చేసేది ఎవరికీ తెలిసే విధంగా కాకుండా సహజంగా ఎలాంటి అడ్వర్టైజ్మెంట్ లేకుండా చేశారు. శుక మహర్షి అనుగ్రహించిన తర్వాత కనీసం తిరిగి కూడా చూడరు అంటారు. అదే విధంగా సుబ్బరామయ్య గారు సహాయం చేసిన తర్వాత వారి నుంచి ఏ గుర్తింపు కోరలేదు - ప్రతిఫలం కోసం ఎదురు చూడలేదు.

**సామాజిక బాధ్యత:**

రోడ్డు మీద పోయేటప్పుడు దారిలో ముళ్ళు కనిపిస్తే కనిపించినా గాజు పెంకులు ఉంటే వాటిని తీసి పక్కన పారవేసేవారు అంతేగాని నాకెందుకులే అని వెళ్ళిపోయేవారు కాదు.

తన ఎదురుగుండా అన్యాయం జరుగుతుంటే కనీసం మాట మాత్రంగా నైనా నువ్వు తప్పు చేస్తున్నావని చెప్పాలని లేకుంటే పదిమందిలో 11వ వాడివి అవుతావని అనేవారు.

ద్రౌపతి వస్త్రాపహరణం జరిగేటప్పుడు మౌనంగా ఉండే భీష్ముడికి పట్టిన గతి కలుగుతుందని ఉదహరించేవారు. ఒక  ఆమె భర్త, ఆమెను వివస్త్రను చేసి హింసిస్తుంటే సార్ అతనిని కొట్టి ఆమెను కాపాడారు.

అన్యాయం జరుగుతుంటే వారిపైన కంప్లైంట్లు వేయించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

నగేష్ కు ఒక కంపెనీ డబ్బులు తీసుకొని ట్రైనింగ్ ఇవ్వకుంటే పోలీస్ ఆఫీసర్ తో చెప్పించి డబ్బును వెనుకకు ఇప్పించారు.

ఈ సృష్టి అంతా గురు పాదాలని అందులో ఎక్కడ సేవ చేసినా అది గురు సేవే అవుతుందని, చెప్పి ఆచరించి చూపించారు.

# భక్తుల అనుభవాలు

**శ్రీ శివరత్నం ఇలా చెప్తున్నారు:** 2023 లో మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి దర్శనమునకు వెళ్ళినప్పుడు సంతానం కలిగితే అక్కడ అన్నదానం చేస్తాను అని మ్రొక్కుకున్నాను. సంవత్సరం తిరిగేసరికి నాకు సంతానం కలిగింది.  మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి సమాధి మందిరం నిర్వాహకులను  ఒక శనివారం రోజు రాత్రిపూట అన్నదానం చేయాలి అంటే ఎంత అవుతుంది అని అడిగాను.  ఆయన సుమారు 1,500 భక్తులు వస్తారు అందువలన  75,000 రూపాయలు అవుతుందండి అని చెప్పారు. అంత డబ్బులు ప్రస్తుతానికి లేవు, అందువలన పిల్ల పెద్ద అయిన తర్వాత మ్రొక్కు తీర్చుకుందాం అని  నేను ఆలస్యం (డిలే)  చేస్తున్నాను.  డిసెంబర్ 2024 లో దత్త జయంతికి 4 రోజులు ముందర ఒకరోజు రాత్రి సుబ్బరామయ్య సార్ గారు స్వప్నంలో కనిపించి నాతో “మీ అమ్మ దగ్గరకు వెళ్లి ఆమెను చూసి  మొగిలిచర్ల దత్తాత్రేయ స్వామి దగ్గరకి వెళ్లి మ్రొక్కు తీర్చుకొని రా” అని స్వప్నాదేశం ఇచ్చారు. నేను కలలోనే ఇక్కడ చాలా పనులు ఉన్నాయి మా అమ్మ దగ్గరికి వెళ్ళటం కష్టం సార్ అని చెప్పాను. అప్పుడు సార్ “సరే మీ అమ్మ సంగతి నేను చూసుకుంటాను నువ్వు మొగిలిచర్ల వెళ్లి మ్రొక్కు తీర్చు” అన్నారు.

తర్వాత రోజు పొద్దున మా అమ్మ ఫోన్ చేసి రాత్రి నాకు ఊపిరి ఆడక చచ్చిపోతాను అనిపించింది. భగవంతుని దయవల్ల కోలుకున్నాను. నేను చనిపోయినట్లయితే మీకు చెప్పడానికి కూడా ఎవరూ ఉండే వాళ్ళు కాదు అని చెప్పేసరికి సుబ్బరామయ్య సార్ మా అమ్మ సంగతి చూసుకుంటాను అన్నది అర్థమైంది. అంతే కాకుండా మా అమ్మకు జరిగిన విషయమే నాకు జరిగితే మ్రొక్కు తీర్చకుండా పోతుంది అందువల్ల వెంబడే మ్రొక్కు తీర్చుకుందామని మందిర నిర్వాహకులకు ఫోన్ చేసి ఏ శనివారం రోజు నేను అన్నదానం చేయటానికి అవకాశం ఉందో అని అడిగితే డిసెంబర్ 21న వీలవుతుంది అని చెప్పారు. అన్నదానం చేయటానికి మాకై మేమే స్వంతంగా సరుకులు తీసుకు వచ్చి వంటలు చేసి అన్నదానం చేసుకోవచ్చా అని అడిగితే ఆయన అలా చేసుకోవచ్చని, అక్కడ ఒకాయన ఫోన్ నెంబర్ ఇచ్చి ఆయనతో కలసి మాట్లాడి చేసుకోమని చెప్పారు. నేను వారితో మాట్లాడి వాళ్ళు చెప్పిన సరుకులు తీసుకుని డిసెంబర్ 21 మధ్యాహ్నమునకు మేము అక్కడకు చేరుకున్నాము. ఆ రోజు మందిర నిర్వాహకుల సహకారంతో శనివారం రోజు రాత్రి 1300 భక్తులకు భోజనాలు ఏర్పాటు చేసి అన్నదానం చేసాము.

కొసమెరుపు ఏమిటంటే నేను తీసుకు వచ్చిన సరుకుల్లో ఒక బస్తా (25 కేజీల) బియ్యం మిగిలింది. తర్వాత రోజు ఆదివారం ఉదయం మా అత్తమ్మ, నా పూర్వ విద్యార్థిని ఇచ్చిన దక్షిణతో 600 మందికి పైగా భక్తులకు ఫలహారం ఇచ్చే సేవ కూడా చేసుకోగలిగాము. అంతేగాకుండా ఇవన్నీ చేయటానికి ఖర్చు 40 వేల రూపాయలు లోపల అయ్యింది. సుబ్బరామయ్య సార్ మన యొక్క అవసరాలను గమనిస్తూ మనల్ని గైడ్ చేస్తూ నా యొక్క బాగోగులు మాత్రమే గాకుండా నా తల్లిని కూడా రక్షిస్తున్నారు. అంతేగాకుండా 40 వేల రూపాయలతో అన్నదానం జరగటం కేవలం సార్ కృప మాత్రమే అని అర్థమవుతుంది.

**శ్రీ రామకృష్ణ బట్టు ఇలా చెపుతున్నారు:**

"అడగందే అమ్మ అయినా పెట్టదు" అనేది వాడుకలో ఉన్న సామెత. కానీ అడగకపోయినా అవసరమైనవన్నీ చేసేదీ, మనల్ని రక్షించేదీ భగవంతుడైన సద్గురువే అనే విషయం మనం మర్చిపోతుంటాము. లౌకికమైన తల్లిదండ్రులకే తమ బిడ్డలు బాగుండాలన్న ఆశ ఉన్నప్పుడు, ఈ విశ్వం అంతటికీ తల్లి, తండ్రి, గురువు అయిన భగవంతుడు అంతకు ఎన్నో రెట్లు ఎక్కువగా మన బాగు కోరతాడు, అందుకు శ్రమిస్తాడు. కానీ మనం ఆయన కృపను, కృషిని గుర్తించలేక ఆయన మన కోరికలన్నీ నెరవేర్చలేదని అలుగుతుంటాం.

మనం సరిగా అబ్జర్వ్ చేసుకుంటే (వెనక్కి తిరిగి చూసుకొంటే) **సద్గురువు మనల్ని అనుక్షణం కంటికి రెప్పవలె కాపాడుతున్నారు** అని తెలుసుకోగలం. కానీ మనకి

సహజంగా అంతటి అబ్జర్వేషన్ ఉండదు, కనుక ఏదో ఒకటి రెండు సందర్భాలలో మాత్రం 'ఆహా దైవం ఎంత సహాయం చేసాడు' అని అనుకుంటాం... అది కూడా ఆయన దయ వలన మాత్రమే.

1) సుమారుగా 2007 సం|| లో అనుకుంటా... ప్రతి నెలా గొలగమూడి లో రెండు రాత్రులు నిద్ర చేయాలని నాకు మ్రొక్కు ఉండేది. అలా ఒకసారి నేను గొలగమూడిలో ఉండగా మా నానమ్మకి ఒంట్లో బాగోలేదని అర్జెంటుగా గుంటూరు వచ్చేయమని మా నాన్నగారు ఫోన్ చేశారు. కానీ అప్పటికి నా రెండు నిద్రలు చేయాలన్న నియమం పూర్తవనందున ఏం చేయాలో తెలియని గందరగోళ పరిస్థితులలో శ్రీసుబ్బరామయ్య సార్ గారిని అడగటానికి వెళ్ళాను. అప్పుడు రాత్రి 8 గంటలవుతుంది... అది సార్ ఆహారం తీసుకునే సమయం. మామూలుగా ఆ టైంలో అమ్మగారు ఎవరినీ అనుమతించరు కానీ నా తాపత్రయము, ఆందోళన చూసి అమ్మగారు నన్ను లోపలకి రానిచ్చి 'ఈ అబ్బాయి ఏదో అడుగుతాడంట' అని చెప్పి సార్ దగ్గరికి తీసుకెళ్లారు. శ్రీ సార్ వివరం కనుక్కొని **'మీ నాయనమ్మకు ఏమీ కాదు. నువ్వు శుభ్రంగా రెండు నిద్రలు ఇక్కడ చేసి వెళ్ళు'** అని చెప్పారు. శ్రీ సార్ చెప్పినట్లే మా నానమ్మ కోలుకుని, తర్వాత 10 ఏళ్ళు పైగా ఎంతో ఆరోగ్యంగా జీవించారు.

2) మనం కొన్నిసార్లు అజ్ఞానం వలన లేనిపోని కొత్త కొత్త కష్టాలు కొని తెచ్చుకుంటూ ఉంటాము. నాకు కలిగిన అలాంటి అనుభవం ఒకటి ఏమిటంటే: మా అపార్ట్మెంట్ అసోసియేషన్లో 'టెర్రస్ మీద మ్రొక్కలు పెంచరాదు' అని చెప్పి ఒక రూల్ తీసుకొచ్చారు. 300 పైగా కుటుంబాలలో చాలా మంది వాళ్ళ పూలకుండీలు, మొక్కలు తీసేసారు కూడా. కానీ నేను మాత్రం మరి ఇద్దరు, ముగ్గురుతో కలిసి దాన్ని గట్టిగా రెసిస్ట్ చేశాను. అప్పుడు అసోసియేషన్ ప్రెసిడెంట్ మమ్మల్ని విడిగా మీటింగ్ కి రమ్మని పిలిచాడు. నేను నాకు అందరి సపోర్టు ఉందనే భ్రమలో ఆ మీటింగుకి అందరిని పిలవాలి అని ఆ మెసేజ్ అందరికీ ఫార్వర్డ్ చేద్దాం అని ఆవేశపడ్డాను. కానీ శ్రీసార్ అలా చేయవద్దని చెప్తున్నారు అని స్పష్టంగా తెలుస్తోంది. సరే! శ్రీసార్ చెప్తున్నారు కనుక అందరినీ పిలిచే ఆలోచనకి స్వస్తి పలికాను. తర్వాత నేను, మరి ఆ ఇద్దరు ముగ్గురం మాత్రం మీటింగుకి వెళితే ఆ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎంతో సున్నితంగా మాకు వివరించి మొక్కలు తీసివేయించారు. తర్వాత తెలిసింది ఏమిటంటే ఆ ప్రెసిడెంట్ తప్ప అందరూ మా ముగ్గురి మీదా కోపంతో ఉన్నారనీ, మీటింగ్ ఎప్పుడో తెలిస్తే వచ్చి పోట్లాటకి సిద్ధముగా ఉన్నారనీ. నిజానికి నేను గనక శ్రీ సార్ మాట వినకుండా ఆవేశపడి ఉంటే అందరితో గొడవ పడవలసి వచ్చేది.

3) అలాగే ఆఫీసులో కూడా ఒకసారి మా క్లైంట్ ది తప్పనుకొని వాళ్లకు నేను ఆవేశంగా ఏదో మెయిల్ పంపిద్దాం అనుకుంటే శ్రీసార్ స్పష్టంగా వద్దని సందేశం

ఇచ్చారు. తీరా చూస్తే తప్పు మా వైపే ఉంది. శ్రీ సార్ మాట వినకుండా ఆవేశపడి ఉంటే అప్పుడు కూడా ఎంతో గందరగోళానికి గురై ఉండేవాడిని. అలా కాకుండా శ్రీ సారే నన్ను కాపాడారు.

4) గత నెల 2024 డిసెంబరు లో మా software లో కొన్ని తప్పులు ఉన్నాయి అని మేము ఎంత ప్రయత్నించినా కొన్ని సరి అవ్వలేదు.

"వెంటనే సరి చేయకపోతే క్లయింట్ వద్ద నుండి కంప్లైంట్స్ వస్తాయి "అని మా మేనేజర్ కూడా కోపంగా ఉన్నాడు. మరురోజుకి కూడా అవ్వకుంటే వేరే వాళ్ళని పిలుస్తాను అన్నట్టుగా అన్నాడు. నిజానికి మేము అవి సరి చేయలేక పోయాము. కానీ శ్రీ సార్ లీలా విలాసం అన్నట్లుగా మా క్లయింట్ వద్దనుండి ఆ ప్రాబ్లెమ్ సాల్వ్ అయినట్లు రిపోర్ట్ వచ్చింది. అందుకు మా మేనేజర్ కొంచెం శాంతించాడు. దాంతో మాకు మరి కొంత టైం దొరికింది గనుక ఈ లోపల మెల్లిగా ప్రాబ్లం సాల్వ్ చేసేసాము.

5) 2022 లో శ్రీసార్, అమ్మగారి దయ వలన మేము మంచి అపార్ట్మెంట్స్ లోకి మారాము. ఇక్కడ నాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అంతా హాయిగా సుఖంగా ఉండేసరికి ఆ దైవం పట్ల కృతజ్ఞతగా, ధర్మంగా ఉండాల్సింది పోయి కొన్ని తప్పుడు ఆలోచనలు చేశాను. వెంటనే ఆ కరుణామయుడు శ్రీ కంచి పరమాచార్య స్వామి వారి పటంలో నుండి అది తప్పు అని తెలియజెప్పి మళ్ళీ నన్ను సన్మార్గంలోకి మళ్ళించారు.

6) ఒకప్పుడు నేను శ్రీ సార్ దగ్గరకు వెళ్లి 'సార్! నేను నెలకి ఒకసారి మాత్రమే గొలగమూడి వస్తున్నాను. అది కూడా ఏదో మొక్కుబడిగా వస్తున్నాను. మిగతా వారి (సాయి, ప్రసాద్, నగేష్, మొ|| వారు) లాగా ప్రేమతో భక్తితో రావటం లేదు' అంటే ప్రేమమూర్తి అయిన శ్రీ సార్ '**నీకు భక్తి ఉందో లేదో అనవసరం. ప్రతి నెలా గొలగమూడి వస్తూ ఉండు. మిగతా సంగతి శ్రీ స్వామి చూసుకుంటారు**' అని మధుర వాక్కులతో ధైర్యం చెప్పారు.

7) ఒకసారి నేను శ్రీ సార్ ప్రక్క గదిలో ఏదో వంట చేద్దామని తెలిసీ తెలీక తాళింపులో చాలా ఎండు మిరపకాయలు వేసాను. దాంతో ఎంతో కారం పుట్టి శ్రీ సార్ గారికి కూడా ఎన్నో తుమ్ములు వచ్చాయి. అప్పుడు సార్ నన్ను తిడతారేమో అనుకున్నాను. కానీ శ్రీసార్ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. కనీసం ఎవరు అలా చేసింది అని కూడా అడగకుండా ప్రేమగా నవ్వుతూ పలకరించారు.

**శ్రీ శేషు కృష్ణ, చెన్నై ఇలా చెబుతున్నారు :**

శ్రీ సుబ్బరామయ్య సార్ ఎంతో ప్రేమ కరుణ స్వరూపులు. తనను ఆశ్రయించిన లేదా దరి చేరిన వారికి ఆయన యొక్క ప్రేమతత్వం అమోఘంగా అనుభవం అయ్యేది. ఆయన నేటికీ నిత్యసత్యులై భక్తులకు కష్టాలు, ఇబ్బందులు తీరుస్తూ తన ప్రేమ స్వరూపాన్ని నిరూపిస్తూ ఉంటారు. అందుకు ఈ క్రింది సన్నివేశం ఉదాహరణ: డిసెంబర్

31, 2024 నేను నా కర్తవ్య నిర్వహణలో ఉన్నప్పుడు రాత్రి 11:30 అయింది. ఇక పడుకుందాము అని అనుకుంటూ ఈ రోజు డిసెంబర్ 31 కదా అని అనుకుంటూ నిద్రకు ఉపక్రమించాను. గత కొన్ని సంవత్సరాలుగా సంవత్సరము చివరి రోజు కదా అని 12 గంటల వరకు మేలుకొనడం లేదు. గాఢ నిద్రలో శ్రీ సార్ తెల్ల డ్రెస్ లో సైకిల్ మీద వెళుతున్నారు. నేను కూడా సైకిల్ మీద వెళుతూ ఉంటే సార్ నా వైపు ప్రేమతో చూస్తూ అంతకు ముందు నుంచి నేను ఏ సాంకేతిక విషయం నేర్చుకుంటే నాకు మేలుగా ఉంటుందో అని మదన పడుతున్న దాని గురించి సార్ విశదీకరిస్తున్నారు. నేను అంతకు ముందు నుంచి రెండు సాంకేతిక సమస్యలలో దేని గురించి నేర్చుకుని దానిని తీసుకుంటే బాగుంటుంది? అనేది ఆలోచిస్తున్నాను. శ్రీ సార్ సైకిల్ మీద నాతో పాటు తొక్కుకుంటూ వస్తూ ఆ రెంటిలో ఒక దాని గురించి విశదీకరిస్తున్నారు. ఏమీ అడగలేదు, కానీ నేను మదన పడుతున్న అని గుర్తించి, శ్రీ సార్ దానిని పరిష్కరించడం, నాకు అవసరమైన మార్గదర్శకత్వం చేయడం శ్రీ సార్ యొక్క విశేష ప్రేమకు మచ్చుతునక. శ్రీ సార్ నిత్యసత్యాలు, తనను ఆశ్రయించిన వారిని అనుక్షణం కనిపెట్టుకొని ఉండి మనకు అవసరమైన సందేశము ఇచ్చి, మార్పును తెప్పించి నడిపించే మార్గదర్శకులు. ఈ గుర్తుతో, పూర్ణ విశ్వాసంతో నిరంతరం వారి స్మరణతో ఉండటమే మనం చేయవలసిన కృషి!

**గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి సమాధి మందిర పూజారి శాస్త్రి గారు ఇలా చెప్తున్నారు:** నేను గొలగమూడికి రాక ముందర ఒక విషయంలో భగవంతుని మహిమను మనస్సులో శంకించినందున తీవ్ర పశ్చాత్తాపంతో బాధపడ్డాను. దానికి శిక్షగా ఏమి వేసుకోవాలి అని అనుకుంటుంటే మనం సామాన్యంగా తప్పు చేసిన వారిని “అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా” అని అరుస్తాము కదా అందువల్ల నేను ఇక మీదట జన్మలో అన్నం తినను అని అనుకున్నాను. మొదట్లో ఆలా చేసేటప్పుడు కొంత శరీరం తగ్గింది. అది చూసిన స్నేహితులు, తెలిసినవారు కారణం తెలుసుకొని అన్నం తినకపోతే రోగాన పడతారు లేదా చనిపోతారు అని చెప్పారు. అందువలన ఆ నియమం పాటించలేక పోయాను. తరువాత గొలగమూడి వచ్చాను. నేను ఒక్కడినే ఉండి నియమం పాటిస్తున్నాను. అలా కొన్ని సంవత్సరాలు ఆ నియమం పాటించాను. గొలగమూడి లో చాలామందికి ఈ విషయం తెలుసు. అలా హాయిగా నియమం పాటిస్తుండగా, నా విషయం తెలిసిన వారు “అన్నం తినకపోతే ఆరోగ్యం పాడవుతుంది” అని మళ్ళీ అనే సరికి ఒక రకంగా భయం, ఆందోళన కలిగాయి. ఎంతమందితో మాట్లాడినా, ఎంత ఆలోచించినా నా ఆందోళన తగ్గలేదు. ఒకరోజు వెంకయ్య స్వామితో ఈ రోజు ఎలాగైనా సరే మీరే ఈ సమస్యకు పరిష్కారం చెప్పాలి అని ప్రార్థించాను. ప్రతిరోజు రాత్రి మందిరం మూసిన వెంటనే నేను నా ఇంటికి వెళ్ళిపోతాను. కానీ ఆ రోజు మందిరం మూసినా

కొంతసేపటి దాకా నేను మందిరం లో ఉన్నాను. మందిరం బయటకు వచ్చేసరికి మందిరం బయట అమ్మగారు (శ్రీ సుబ్బరామయ్య సార్ గారి ధర్మపత్ని శేషమ్మ గారు), వాళ్ళబ్బాయి శేషయ్య ప్రతిరోజూ లాగా వెంకయ్య స్వామి సమాధి మందిర దర్శనానికి వచ్చి బయట నుంచే నమస్కారం చేసుకుని ఉన్నారు. నన్ను చూచి నా విషయం తెలిసిన అమ్మగారు తమంతట తామే "మీరు యింకా అన్నం తింటున్నారా లేదా?" అని నన్ను అడిగారు. నేను నాకు వచ్చిన అనుమానం శేషమ్మ గారికి చెప్పాను. అమ్మగారు తడుముకోకుండా "ఎంతమంది లేరు? షుగర్ పేషెంట్స్ అన్నం తినకుండా ఉంటున్నారు. అన్నం తినకపోతే చచ్చేటట్లయితే షుగర్ పేషెంట్స్ అందరూ చనిపోయి ఉండాలి. అన్నం తినకపోతే ఏమీ అవదు. మీరు భగవంతుని కోసం పెట్టుకున్న నియమం పాటించండి" అని చెప్పారు. ఆ మాట విని నాకు ఎంతో ధైర్యం వచ్చింది, ఆనందం కలిగింది. శ్రీ వెంకయ్య స్వామికి చెప్పుకుంటే అమ్మగారి ద్వారా సమాధానం ఇచ్చారు. అప్పటినుండి స్వామి దయ వలన నియమ పాలన జరుగుతోంది. నేను ఆరోగ్యంగా ఉన్నాను.

**ఉమా మహేష్ గారు ఇలా చెపుతున్నారు:**

నా పేరు మహేష్. మాది అనంతపురం. 2003 వ సంవత్సరంలో భగవాన్ శ్రీ శ్రీ శ్రీ వెంకయ్య స్వామి వారి ప్రథమ దర్శన భాగ్యం కలిగింది. తర్వాత 2004లో మేము కొంతమంది సైకిల్ యాత్ర అనంతపురం నుండి గొలగమూడి కి వెళ్ళాము. మాకు పెసల సుబ్బరామయ్య సార్ గారు గురించి తెలియదు. మేము గొలగమూడి లో విచారించగా సుబ్బరామయ్య సార్ గారు సాయంకాలము బ్రహ్మంగారిమఠంలో సత్సంగం చేస్తూ ఉంటారు, అని చెప్పారు. వారి దర్శనం కోసం మేము బ్రహ్మంగారి గుడి కి వెళ్లి దర్శించుకున్నాం. మేము సైకిల్ యాత్ర చేశామని తెలుసుకొని శ్రీ సార్ గారు "అయ్యా మీరు చరితార్థులయ్యారు" అంటూ దీవించారు. ప్రథమ దర్శనంలోనే మేము ఆకర్షించబడ్డాము. అటు తరువాత గొలగమూడి కి వెళ్లినప్పుడల్లా సుబ్బరామయ్య సార్ గారిని దర్శించేవారము. నేను 2021 లో గొలగమూడి లో ఉండి 11 రోజులు దీక్ష చేశాను. ఉదయం నుండి సాయంకాలం వరకు పారాయణం చేస్తూ ప్రదక్షిణ చేస్తున్నాను. మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు వరకు గుడి తలుపులు మూసేసినందువలన నేను సుబ్బరామయ్య సార్ సమాధి చుట్టూ పారాయణ చేస్తూ ప్రదక్షిణ చేసేవాడిని, రెండు గంటల నుండి ఐదు గంటల వరకు. అలా 11 రోజులు ప్రదక్షిణలు చేశాను. నేను అప్పటివరకు ఆయన ఒక గొప్ప సాధకుడని అలాగే వెంకయ్య స్వామి వారి భక్తులని ఆయనకు ప్రదక్షిణ చేస్తే వెంకయ్య స్వామి వారికి చేసినట్లేనని భావించాను. అదేవిధంగా 2022 లో కూడా 13 రోజులు మధ్యాహ్నం 2 ఓ క్లాక్ టు ఫైవ్ ఓ క్లాక్ దాకా ప్రదక్షిణలు చేశాను. అటు తర్వాత సుబ్బరామయ్య సార్ గారు అప్పుడప్పుడు స్వప్న దర్శనాలు ఇచ్చేవారు. 2023లో కార్తీక మాసంలో 21 రోజు దీక్ష చేయాలని గొలగమూడి కొచ్చాను.

అప్పుడు విపరీతమైన వర్షాలు వచ్చాయి. 15 డేస్ ఆగకుండా వచ్చాయి. అప్పుడు నేను "డి బ్లాక్ రూమ్ లో ఉన్న సాయంకాలం నాలుగు గంటల సమయంలో రూమ్ లో నుండి బయటకు వస్తున్నాను. అక్కడ అన్ని నీళ్లు నిలిచాయి. అవి టైల్స్ కాబట్టి నేను నడుస్తూ ఉండి జారీ కింద పడ్డాను. వెంటనే రెండు చేతులు సపోర్ట్ చేశాను. నేను బరువు ఎక్కువగా ఉండటం వల్ల నా రెండు భుజాలు కొంత డిస్టర్బ్ అయ్యాయి. అప్పటినుండి నాకు కుడివైపు భుజం నుండి మణికట్టు దాకా చేయి లాగేసేది. ఒకే చోటు నిలుచుకుంటే విపరీతంగా లాగేసేది. ఆ చేయి కదులుతూనే ఉండాలి. కుడివైపే తిరిగి పడుకోవాలి. ఎడమవైపు పడుకోగానే చెయ్యంతా మణికట్టు దాకా లాగుతుండేది. నిద్ర పట్టేది కాదు. అలాంటి పరిస్థితుల్లో నేను ట్రీట్మెంట్ కూడా చేయించుకోలేదు. ఎవరికీ చెప్పలేదు. ఒకనాటి రాత్రి శ్రీ సుబ్బరామయ్య సార్ గారు కలలో కనిపించి అయ్యా నీకు నొప్పి లేకుండా పోయినా మరలా వస్తుంది. మణికట్టు దాకా వస్తుంది అని చెప్పారు. త్వరలోనే తగ్గిన నొప్పి శ్రీ సార్ చెప్పినట్లుగా ఒక నెల తర్వాత మరలా వచ్చింది. ఎప్పుడు నయమవుతుందో సార్ చెప్పలేదు అందువలన నేను కూడా స్వామి చెప్పిన సూక్తి “నొప్పి ఎంత అనుభవిస్తే అంత మంచిది గదయ్యా!” ను గుర్తు పెట్టుకొని ఏ మందులూ వేసుకోలేదు. దాదాపు మూడు నెలలు ఆ నొప్పి అనుభవించాను. ఆ తర్వాత నొప్పి రాలేదు. ఆ విధంగా రాబోవు దాన్ని సార్ ముందుగా సూచించారు. అంతేగాకుండా సార్ గమనిస్తూన్నారు అనే విషయాన్ని నాకు బాగా తెలియచేసారు.

ఆశ్రిత కల్పవృక్షం గా **శ్రీ సార్ సతీష్ కి ప్రసాదించిన అనుభవాలను** (ఉద్యోగం, మెరుగైన ఆర్థిక పరిస్థితి, ప్రతి చిన్న పనికి ఆధార పడేటట్లు చేయటం) ఇచ్చట పంచుకోమ్తున్నాడు :

వెంకయ్యస్వామి దగ్గరకు సతీష్ తన ఆరో క్లాసు నుంచి వస్తున్నా సుబ్బరామయ్య సార్ గురించి తెలియదు. బీటెక్ అయిన తర్వాత మొట్టమొదటిసారి గొలగమూడి లో సార్ దర్శనం అయ్యింది. బీటెక్ అయిన మూడు సంవత్సరాల దాకా సతీష్ కి ఉద్యోగం రాలేదు. ఒకసారి స్వప్నంలో ఒక పెద్ద సముద్రపు అల సతీష్ వైపు వస్తోంది. దాంట్లో మునిగిపోతాడని భయం వేసి పరిగెడుతున్నాడు. ఇంతలో జనాల మధ్యలో నుంచి సుబ్బరామయ్య సార్ వచ్చి సతీష్ చేతిలో ఉన్న బరువైన బ్యాగు ఒకచేత్తో పట్టుకుని రెండో చేత్తో సతీష్ ని పట్టుకొని నడుస్తున్నారు. సార్ కి అప్పుడు కాలు సరిగా లేక నడక సరిగ్గా లేదు. సతీష్ సార్ తో 'మీరు ఎందుకు సార్ బ్యాగ్ పట్టుకునేది, నాకు ఇవ్వండి' అని అన్నాడు. సుబ్బరామయ్య సార్ ఏమీ మాట్లాడకుండా నడుస్తున్నారు. నేరుగా గొలగమూడి వెంకయ్య స్వామి అగ్నిగుండం దగ్గరకు తీసుకువచ్చి సతీష్ ని అక్కడ వదిలిపెట్టారు. అక్కడ నుండి సార్ ఇంకొక వ్యక్తితో వెళ్ళిపోయారు. ఆ సంఘటన బట్టి సతీష్ కు తనను శ్రీ సార్ స్వామి కి అప్పగించి తన పాపకర్మలు సుబ్బరామయ్య సార్

తీసివేశారు అని అనిపించింది. ఆ స్వప్న దర్శనం తర్వాత రెండు నెలలకు సతీష్ కు ఉద్యోగం వచ్చింది.

కేరళలో ఉద్యోగం వచ్చినందుకు ఆనందంగా ఉన్నా, గొలగమూడికి దూరంగా కేరళలో కాకుండా ఏదైనా బెంగళూరులో కానీ చెన్నై లో కానీ పోస్టింగ్ వస్తే బాగుండేది కదా అని ఆలోచనలు వచ్చాయి. ఆ సమయంలో ఒకసారి గొలగమూడికి వచ్చి వెంకయ్య స్వామి దర్శనం చేసుకుని 108 ప్రదక్షిణలు చేసి స్వామికి మనసులోనే 'సార్ ఉద్యోగం విషయం ఏదైనా చెప్పాలి' అని అనుకున్నాడు. సాయంత్రం సత్సంగంలో సార్ మాట్లాడుతూ "నీటి ఋణం, నిద్ర ఋణం తీరాలి. స్వామి ఎక్కడ పెడితే అక్కడికి వెళ్లాలి. స్వామి దగ్గరే ఉంటాను, వారం వారం గొలగమూడి రావాలి, స్వామి అన్నం తింటాను అంటే కుదరదు" అని చెబుతూ సతీష్ తో "అర్థమైందా స్వామి?" అని అడిగారు. దానితో సతీష్ కు తన మనసులో ఉన్న ఆలోచనలు సుబ్బరామయ్య సార్ కు తెలుస్తున్నాయని తెలిసింది.

ఉద్యోగంలో చేరిన తరువాత డెన్మార్క్ లో ఒక ప్రాజెక్టు కోసం సతీష్ ను వెళ్ళమన్నారు. వీసాకి అప్లై చేయడానికి అతని ఇంజనీరింగ్ సర్టిఫికెట్ ఒకటి కావాలి. అది యూనివర్సిటీ లోనే ఉంది. సామాన్యంగా దాని కోసం అప్లై చేస్తే మూడు నెలల తర్వాత వస్తుంది. సతీష్ కు త్వరగా కావాలని చెప్పి గొలగమూడిలో సార్ కు చెప్పుకొని అనంతపురం వెళ్లాడు. యూనివర్సిటీలో ఆ సర్టిఫికెట్ కోసం అప్లై చేస్తే అక్కడ ఉన్న క్లర్క్ "మీకు మూడు నెలల తర్వాత మేం పంపిస్తాం' అని చెప్పాడు. ఆఫీసులో అతని వెనకాల సాయిబాబా ఫోటో ఉంది. సతీష్ బాబా నామం చెప్పుకుంటూ అక్కడే ఉన్నాడు. కొంతసేపటికి సతీష్ ఆ క్లర్క్ కి తన విషయం మొత్తం చెప్పాడు. అతను అర్థం చేసుకుని మూడు నాలుగు గంటల లోపల ఆ సర్టిఫికేట్ ఇచ్చేశాడు. మూడు నెలల తరువాత రావలసిన సర్టిఫికెట్ మూడు గంటల్లో చేతికి రావడం అంటే అది కేవలం సుబ్బరామయ్య సార్ కృప మాత్రమే:

నిజానికి అప్పట్లో సతీష్ వాళ్ళ ఆర్థిక పరిస్థితి అప్పుల వల్ల బాగా లేదు. అతను చేసే ఉద్యోగం ఒక మూడు నాలుగు సంవత్సరాలు చేస్తే గాని ఆ అప్పులు తీరవు. అలాంటిది డెన్మార్క్ పంపించి సార్ సతీష్ కు ఆరు ఏడు నెలల పాటు రెండు జీతాలు (ఒకటి ఇండియా లోది, రెండవది డెన్మార్క్ లోది) ఇప్పించారు. అంతేగాకుండా అతను ఉండటానికి ఇల్లు కూడా కంపెనీ వారే ఇచ్చారు. దానితో అతనికి ఖర్చు ఏమీ ఉండేది కాదు. అందువలన వారికి ఉన్న అప్పులన్నీ కూడా ఆ ఆరు నెలలలో తీర్చేశారు.

డెన్మార్క్ లో సతీష్ ఒక పాకిస్తానీ మేనేజర్ క్రింద పని చేయాల్సి వచ్చింది. అంతకు ముందు అతని దగ్గర ఏడుగురు ఉద్యోగస్తులు మూడు నెలల్లో వెళ్లిపోయారు.

సతీష్ మనసులోనే సార్ కి మీరే రక్షించాలి అని చెప్పుకున్నాడు. ఒక నెల తరువాత ఆ మేనేజర్ సతీష్ ని అభినందిస్తూ ఈ-మెయిల్ చేశాడు.

డెన్మార్క్ నుంచి వచ్చిన తర్వాత సతీష్ వాళ్ల కంపెనీ వాళ్ళు H1 వీసా ప్రాసెస్ చేసి యూఎస్ కి పంపించారు. 2020 మొదట్లో ఒక పెద్ద ప్రాజెక్టు వచ్చింది. చేసేయగలమని ఆ ప్రాజెక్టు సతీష్ ఒప్పుకున్నాడు. ఆ ప్రాజెక్టు మీద కొన్ని నెలలు కష్టపడి చేసినా పూర్తి కావట్లేదు. చివరికి తన తప్పు తెలుసుకున్నాడు. అంటే సతీష్ ఏ ప్రాజెక్టులోకి వెళ్లాలన్నా, టైమ్ లైన్స్ కి ఒప్పుకోవాలన్నా సుబ్బరామయ్య సార్ (పటానికి) దగ్గర చెప్పుకున్న తర్వాత మాత్రమే ఆఫీసులో వారికి చెప్పేవాడు. ఆఫీసులో ఈ పెద్ద ప్రాజెక్టు వచ్చినప్పుడు సుబ్బరామయ్య వారికి చెప్పకుండా తను చేసేయగలడు అనే నమ్మకంతో ఒప్పుకొన్నాడు. కానీ పని జరగక పోయేసరికి సార్ కు 'పూర్తి ప్రయత్నం చేశాను, నా వల్ల కావట్లేదు మీరే హెల్ప్ చేయాలి" అని చెప్పుకుని పడుకున్నాడు. తర్వాత రోజు ఉదయం ఆఫీసులో వర్క్ గురించి కొత్త ఐడియాలు వచ్చి తొందరగా పని పూర్తయింది.(గోర్తి శివ సార్ కు పీహెచ్డీలో వచ్చిన ఆలోచనల వలె) అన్ని ప్రోగ్రామ్స్ సక్సెస్ ఫుల్ గా రన్' అయ్యాయి. టెస్టింగ్ పూర్తయిపోయింది. ఈ సంఘటనతో ప్రతి చిన్న దానికి గురువు మీద ఆధారపడాలి అనేది సతీష్ కి మాత్రమే కాక మనందరికీ మార్గదర్శకం.

**మదన్ కుమార్ గారు ఇలా చెపుతున్నారు**

***శ్రీ సుబ్బరామయ్య మాస్టర్- విష్ణువు- మా గురువుగారు***

17.08.2019

నేను ఒక రోజున కాక బలికి అన్నం సమర్పిస్తూ ఉంటే ఒక కోతి నా చేతిలో నుంచి నేను పెట్టకముందే ఆహారాన్ని లాక్కుంది. అది చూచి నేను కొంచెం భయంగానూ, అసహనంగా ఫీలయ్యాను. నాటి రాత్రి కలలో భగవాన్ శ్రీ రమణ మహర్షులు, ప్రక్కనే శ్రీ సుబ్బరామయ్య మాస్టర్ గారు కనిపించారు. నేను నా ఇంటర్మీడియట్ స్నేహితునికి వారిరువురిని చూపిస్తూ భగవాన్ రమణ మహర్షులు నీకు తెలుసు కదా! ఆ పక్కన ఉన్న వారు మా గురువుగారు వారి పేరు *విష్ణువు* అని చెప్తున్నాను. సుబ్బరామయ్య మాస్టర్ ని చూపిస్తూ ఆయన విష్ణువు అని ఎందుకు పేరు పెట్టుకున్నారంటే వారి గురువు శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారు సాక్షాత్తు విష్ణు స్వరూపమే అందుకే వీరు విష్ణువు అని పేరు పెట్టుకున్నారు అని చెప్పాను.

ఆ తర్వాత రమణ మహర్షి గారి చేతి నుండి ఆహారాన్ని కుక్కలు, పక్షులు, కోతులు అన్నీ తీసుకుంటున్నాయి. దానిని బట్టి నేను నిన్న కోతి నా చేతిలో ఆహారం లాక్కుంటే అసహ్యించుకోవడం తప్పు అని బోధించారని అర్థమయ్యింది.

**ఓం నారాయణ - ఆదినారాయణ**